



కలెక్టర్‌కు వినతిపత్రం అందజేస్తున్న మత్స్యకారులు

నరక ప్రయాణం

అధ్వానంగా తయారైన రహదారులు

- వర్షాలతో పరిస్థితి మరింత దారుణం
- గోతుల్లో నీరుచేరి.. వాహనదారుల ఇక్కట్లు
- పాడైపోతున్న వాహనాల విడిభాగాలు
- రెట్టింపు అయిన ప్రయాణ సమయం



వడ్డాది- పాడేరు ఆర్‌అండ్‌బీ రోడ్డులో మాడుగుల మండలం ముకుందపురం వద్ద గోతులు ఏర్పడి ఆనవాళ్లు లేని తారు రోడ్డు

(అనకాపల్లి- ఆంధ్రజ్యోతి న్యూస్ నెట్‌వర్క్)

మరమ్మతులకు నోచుకోని రహదారులు.. తరచూ కురుస్తున్న వర్షాలు.. అధిక లోడుతో నడుస్తున్న భారీ వాహనాలు.. వెరసి జిల్లాలో పలు రహదారులు అధ్వానంగా తయారయ్యాయి. ఎక్కడికక్కడ గోతులు ఏర్పడి, వర్షం నీరు నిలిచిపోయి వాహనదారులు రాకపోకలకు ఇబ్బంది పడుతున్నారు. రాత్రిపూట.. ముఖ్యంగా కొత్త ఆయా రహదారుల్లో ప్రయాణించే ద్విచక్ర వాహనదారులు దగ్గరకు వచ్చే వరకు గోతులు కనిపించక ప్రమాదాలకు గురవుతున్నారు. రహదారులు గోతుల మయం కావడంతో అన్ని రకాల వాహనాల పాడైపోతున్నాయి.



గోతులతో నిండిన చోడవరం-జన్నవరం రహదారి



అడ్డరోడ్డు-నర్సీపట్నం మార్గంలో కోటవురట్ల మండలంలో ఛిద్రమైన రోడ్డు

జిల్లాలో రోడ్లు, భవనాల శాఖ ఆధ్వర్యంలో 245 కిలోమీటర్ల పొడవున రోడ్లు ఉన్నాయి. వీటిలో 175 కిలోమీటర్ల రాష్ట్ర రహదారులు, మిగిలినవి జిల్లా రహదారులు, మరో 150 కిలోమీటర్ల వరకు గ్రామీణ రోడ్లు ఉన్నాయి. వైసీపీ హయాంలో రహదారులకు నిర్వహణ పనులను గాలికొదిలేసింది. కొన్నిచోట్ల రహదారులకు అభివృద్ధి పనులు చేపట్టినప్పటికీ కాంట్రాక్టర్లకు బిల్లులు చెల్లించకపోవడంతో మధ్యలోనే ఆగిపోయాయి. దీంతో రహదారులు అధ్వానంగా తయారయ్యాయి. దీనికితోడు భారీ వాహనాల రాకపోకలతో రోడ్లు మరింత పాడయ్యాయి. కనీసం గోతులు కూడా కప్పకపోవడంతో రానురాను అవి మరింత పెద్దవయ్యాయి. కొద్దిపాటి వర్షం కురిసినా.. గోతుల్లో నీరు చేరి పంట కుంటలను తలపిస్తున్నాయి. భారీ వాహనాలు వెళుతున్నప్పుడు గోతులు మరింత పెరిగిపోయి, రాళ్లు లేచి రోడ్డుపై పడుతున్నాయి. దీంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అర్థగంట పట్టే ప్రయాణం.. గోతుల కారణంగా గంటకుపైగా పడుతున్నది.

ముఖ్యంగా బీఎన్ రోడ్డులో సబ్బవరం మండలం లింగాలతిరుగుడు నుంచి వెంకన్నపాలెం, చోడవరం, వడ్డాది, రావికమతం మీదుగా ... మిగతా 8వ పేజీలో

బల్క్ డ్రగ్ పార్కు వద్దంటే వద్దు..

రద్దు చేయాల్సిందేనని మత్స్యకారులు ముక్తకంఠంతో డిమాండ్

- హెటెరో కాలుష్యంతో ఇప్పటికే ప్రాణాంతక వ్యాధులు ప్రబలుతున్నాయని ఆందోళన
- కంపెనీల కంటే తమ ప్రాణాలకు ప్రాధాన్యం ఇవ్వాలని వినతి



సభలో మాట్లాడుతున్న కలెక్టర్ విజయకృష్ణన్



హాజరైన మత్స్యకారులు

- సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళతానన్న కలెక్టర్ విజయకృష్ణన్
- నిపుణులతో అధ్యయనం..100 రోజుల్లో నివేదిక
- కలెక్టర్ హామీలపై సంతృప్తి చెందని మత్స్యకారులు
- నిరసన దీక్షలు కొనసాగించాలని నిర్ణయం

నక్కపల్లి, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): **మండలంలోని రాజయ్యపేట ప్రాంతంలో ఏర్పాటు చేయతలపెట్టిన బల్క్‌డ్రగ్ పార్కు అనుమతులను రద్దు చేయాల్సిందేనని మత్స్యకారులు ముక్తకంఠంతో స్పష్టం చేశారు. ఈ ప్రాంతంలో ఇప్పటికే ఏర్పాటుచేసిన హెటిరో ఔషధ కంపెనీ నుంచి వెలువడుతున్న కాలుష్యం వల్ల ప్రాణాంతక వ్యాధులబారిన పడుతున్నామని ఆందోళన వ్యక్తం చేశారు. కంపెనీల కంటే ప్రజల ప్రాణాలకే ప్రభుత్వం ప్రాధాన్యం ఇవ్వాలని జిల్లా కలెక్టర్‌ను కోరారు.**

బల్క్ డ్రగ్ పార్కు వద్దంటూ రాజయ్యపేట కేంద్రంగా మత్స్యకారులు 41 రోజుల నుంచి నిరసన దీక్షలు చేస్తున్న విషయం తెలిసిందే. ఈ నెల 12వ తేదీన మత్స్యకారులు అనూహ్యంగా నక్కపల్లి వరకు ర్యాలీ నిర్వహించి, జాతీయ రహదారిని దిగ్బంధించారు. దీంతో కలెక్టర్ విజయకృష్ణన్, ఎస్పీ తుహిన్‌సిన్హా వచ్చి ఆందోళనకారులతో మాట్లాడారు. త్వరలో రాజయ్యపేట వచ్చి, బల్క్‌డ్రగ్ పార్కుపై మత్స్యకారులతో మాట్లాడతానని ... మిగతా 8వ పేజీలో

ప్రభుత్వం దృష్టికి మత్స్యకారుల సమస్యలు

- కలెక్టర్ విజయకృష్ణన్ వెల్లడి

మత్స్యకారులు చెప్పిన విషయాలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తానని, తన పరిధిలో వున్న సమస్యలను పరిష్కరిస్తానని కలెక్టర్ విజయకృష్ణన్ చెప్పారు. మత్స్యకారులు తమ సమస్యలను చెప్పుకున్న అనంతరం ఆమె మాట్లాడుతూ, రాజయ్యపేట గ్రామ పరిధిలో బల్క్‌డ్రగ్ పార్కు పనులు ఆపుతామని చెప్పారు. దీంతో పలువురు మత్స్యకారులు ఒక్కసారిగా లేచి.. అలా కాదని, మొత్తం పనులు ఆపాలని డిమాండ్ చేశారు. కలెక్టర్ స్పందిస్తూ..ఇంతవరకు ఏ కంపెనీ ఇక్కడకు రాలేదని, కేంద్ర ప్రభుత్వం ఆదీనంలోని బల్క్‌డ్రగ్ పార్కుకు సంబంధించి రహదారులు, డ్రైనేజీలు, విద్యుత్తు, నీటి సరఫరా పనులు మాత్రమే జరుగుతున్నాయని చెప్పారు. ఏ ప్రభుత్వం కూడా ప్రజలను ఇబ్బంది పెట్టే చర్యలకు పాల్పడదని ఆమె స్పష్టం చేశారు. ప్రపంచ వ్యాప్తంగా పర్యావరణం, కాలుష్యం, తదితర అంశాల్లో నిష్ణాతులైన నిపుణులతో తీర ప్రాంత ప్రజల సమస్యలపై అధ్యయనం చేసి 100 రోజుల్లో నివేదిక ఇవ్వాలని సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్, హోం మంత్రి అనిత ఆదేశించారని కలెక్టర్ చెప్పారు. కాగా కలెక్టర్ వచ్చినప్పటికీ తమ సమస్యలకు పరిష్కారం లభించలేదంటూ మత్స్యకారులు అసంతృప్తి వ్యక్తం చేశారు. బల్క్‌డ్రగ్ పార్కును రద్దు చేసేవరకు పోరాటాన్ని ఆపేది లేదని స్పష్టం చేశారు.

రయ్.. రయ్..

పగ్గాల్లేని ట్రావెల్స్ బస్సులు

- పరిమితికి మించిన వేగంతో ప్రయాణం
- కర్నూలు ఉదంతంతో సర్వత్రా ఆందోళన
- విశాఖ నుంచి విజయవాడ, హైదరాబాద్, బెంగళూరు, చెన్నైలకు నిత్యం వేలాది మంది రాకపోకలు
- ఈ నెల 15న రాజస్థాన్‌లో ఒక బస్సు దహనం



పర్మిట్ గడువు ముగియడంతో సీజ్ చేసిన బస్సు

విశాఖపట్నం, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): **కర్నూలు జిల్లాలో జరిగిన ప్రైవేటు ట్రావెల్స్ బస్సు ప్రమాదం అందరిలోను ఆందోళన రేకెత్తించింది. హైదరాబాద్ నుంచి బెంగళూరు వెళుతున్న వేమూరి కావేరి ట్రావెల్స్ బస్సు శుక్రవారం తెల్లవారుజామున కర్నూలు సమీపంలో బైక్‌ను ఢీకొట్టి మంటల్లో దహనమైంది. ఈ ప్రమాదంలో 19 మంది సజీవ దహనమయ్యారు. మరో 21 మంది గాయాలతో బయటపడ్డారు. బాధితుల్లో సాఫ్ట్‌వేర్ ఇంజనీర్లు, వారి కుటుంబ సభ్యులు ఎక్కువగా ఉన్నారు. ఈ ఘటన నగరవాసులను దిగ్భ్రాంతి కలిగించింది.**

- అప్పడే అప్రమత్తమైన రవాణా, పోలీసు శాఖలు
- 58 కేసులు...4 బస్సుల సీజ్... రూ.9.5 లక్షల జరిమానా

ఉత్తరాంధ్ర జిల్లాల వాసులు వేలాది మంది హైదరాబాద్, బెంగళూరు, చెన్నైలలో ఉద్యోగాలు చేస్తున్నారు. వారాంతపు రోజుల్లో, పండుగ సమయాల్లో వారు ఇక్కడకు రావడం, కుటుంబ సభ్యులు ఇక్కడి నుంచి అటు వెళ్లడం పరిపాటిగా మారింది. బెంగళూరు, హైదరాబాద్‌లకు తక్కువ సమయంలో రైలు రిజర్వేషన్ సదుపాయం లభించకపోవడం వల్ల ... మిగతా 8వ పేజీలో

కశింకోట పూర్వ కార్యదర్శి

ఆర్థిక అవకతవకలు

ఇళ్ల పన్నులకు సంబంధించి రూ.20,60,215 జమచేయని వైనం

- కలెక్టర్‌కు, డీపీవోకు ఫిర్యాదు చేసిన డిప్యూటీ ఎంపీడీవో
- ప్రస్తుతం భీమిలి మండలం చిప్పాడలో పనిచేస్తున్న కార్యదర్శి



ఉన్నతాధికారులకు డిప్యూటీ ఎంపీడీవో చేసిన ఫిర్యాదు లేఖ

కశింకోట, సెప్టెంబర్ 24 (ఆంధ్రజ్యోతి): మేజర్ పంచాయతీ కశింకోటలో కార్యదర్శిగా పని చేసిన ఎస్.రామచంద్రరావు ఆర్థిక అవకతవకలకు పాల్పడినట్టు డిప్యూటీ ఎంపీడీవో తోటారావు కలెక్టర్ విజయకృష్ణన్‌కు, డీపీవో సందీప్‌కు, ఎంపీడీవో చుక్కా చంద్రశేఖరరావుకు ఫిర్యాదు చేశారు. ప్రస్తుతం భీమునిపట్నం మండలం చిప్పాడ పంచాయతీ కార్యదర్శిగా పనిచేస్తున్న రామచంద్రరావు.. కశింకోట నుంచి రిలీవ్ అయిన సమయంలో పంచాయతీకి సంబంధించి రికార్డులను పూర్తిస్థాయిలో సమర్పించలేదని ఫిర్యాదులో పేర్కొన్నారు. 2025 మార్చి 31వ తేదీ వరకు ఆస్తి పన్ను రూపేణా రూ.55,41,693 కాగా, రూ.34,81,478 మాత్రమే 'స్వర్ణ పంచాయతీ' ... మిగతా 8వ పేజీలో

జాబ్‌మేళాలతో కోటి ఉద్యోగాలు

నర్సీపట్నం నియోజకవర్గంలో మూడు నెలలకోసారి నిర్వహణ

- స్పీకర్ అయ్యన్నపాత్రుడు
- మెప్మా ఆధ్వర్యంలో జాబ్‌మేళా.. 131 మందికి ఉద్యోగాలు




ఒక యువకుడికి ఉద్యోగ నియామకపత్రాన్ని అందజేస్తున్న స్పీకర్ అయ్యన్నపాత్రుడు

నర్సీపట్నం, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని ప్రతి అసెంబ్లీ నియోజకవర్గంలో జాబ్ మేళాలు నిర్వహిస్తూ కోటి మంది నిరుద్యోగ యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పించాలని ప్రభుత్వం నిర్ణయించిందని శాసనసభ స్పీకర్ చింతకాయల అయ్యన్న పాత్రుడు అన్నారు. శుక్రవారం పట్టణ పేదరిక నిర్మూలన సంస్థ (మెప్మా) ఆధ్వర్యంలో నిపుణ సంస్థ సహకారంతో పెదబొడ్డేపల్లి మునిసిపల్ కార్యాలయంలో జాబ్ మేళా జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన ఆయన.. ఉద్యోగాలకు ఎంపికైన అభ్యర్థులకు నియామక పత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా అయ్యన్న మాట్లాడుతూ, నర్సీపట్నంలో మూడు నెలలకు ఒకసారి జాబ్ మేళా నిర్వహిస్తామని, నిరుద్యోగ యువత వీటిని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. మాకవరపాలెం మండలం శెట్టిపాలెంలో ఏర్పాటు కానున్న కాఫీ యూనిట్ 800 మందికి ఉద్యోగాలు వస్తాయని, నర్సీపట్నం నియోజకవర్గం పరిధిలోని నిరుద్యోగులకు ప్రాధాన్యం ఇవ్వాలని అధికారులను ఆదేశించినట్టు చెప్పారు. జాబ్‌మేళాకు 723 మంది హాజరు కాగా 300 మంది రిజిస్ట్రేషన్ చేసుకున్నారు. వీరిలో 131 మంది ఉద్యోగాలకు ఎంపికయ్యారు. 18 ప్రముఖ కంపెనీల ప్రతినిధులు ఇంటర్వ్యూలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మునిసిపల్ చైర్‌పర్సన్ బోడపాటి సుబ్బలక్ష్మి, కౌన్సిలర్లు చింతకాయల పద్మావతి, రాజేశ్, మెప్మా పీడీ సరోజని, మునిసిపల్ కమిషనర్ జంపా సురేంద్ర, జనసేన పార్టీ నియోజకవర్గం ఇన్‌చార్జి సూర్యచంద్ర పాల్గొన్నారు.

రూ.350 కోట్లతో 'రైవాడ' ఆధునికీకరణ

'డ్రిప్' పథకం ద్వారా కేంద్రానికి ప్రతిపాదనలు

- రూ.50 కోట్ల 'జైకా' నిధులతో కాలువల అభివృద్ధి
- చిన్నతరహా సాగునీటి వనరుల మరమ్మతులకు రూ.133 కోట్లతో ప్రతిపాదనలు
- జలవనరుల శాఖ ఎస్ఈ అప్పలనాయుడు



రైవాడ జలాశయం నుంచి కాలువలకు నీటిని విడుదల చేసే రెగ్యులేటర్ పరిశీలిస్తున్న ఎస్ఈ అప్పలనాయుడు

దేవరాపల్లి, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రైవాడ జలాశయాన్ని జల వనరుల శాఖ సూపరింటెండెంట్ ఇంజనీర్ పి.అప్పలనాయుడు శుక్రవారం ... మిగతా 8వ పేజీలో



ఆలయంలో భూలోకమాంబ అమ్మవారు



ఆలయంలో సుబ్రహ్మణ్యేశ్వర స్వామి

నేడు ఎలమంచిలిలో పంచరాత్రుల తీర్థమహోత్సవం

- తులసీనగర్, పాతవీధి ప్రాంతాల్లో భారీ ఎత్తున ఏర్పాట్లు
- ఆకట్టుకుంటున్న విద్యుద్దీపాల సెట్టింగులు

-8లో



రావికమతంలో వర్షం

దంచికొట్టిన వాన

- నాతవరంలో అత్యధికంగా 52 మి.మీ.లు

అనకాపల్లి, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడన ప్రభావంతో జిల్లాలోని పలు మండలాల్లో గురువారం రాత్రి భారీ వర్షం కురిసింది. అత్యధికంగా నాతవరం మండలంలో 52 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. గురువారం సాయంత్రం ఆరు గంటల నుంచి శుక్రవారం ఉదయం 8 గంటల వరకు మండలాల వారీగా నమోదైన వర్షం పాతం వివరాలు.. కె.కోటపాడులో 51.2 మిల్లీమీటర్లు ... మిగతా 8వ పేజీలో

రాత్రి వేళ పుట్టలో పాలు

▸ వెంకటాపురంలో అనాదిగా వస్తున్న ఆచారం

▸ గ్రామస్థులంతా కలిసి చీకటిపడ్డాక వెళ్లి నాగేంద్రుడికి పూజలు



వెంకటాపురంలో చీకటిపడ్డాక పుట్టపూజ చేస్తున్న సర్పంచ్, మాజీ సర్పంచ్ కుటుంబీకులు

మునగపాక, అక్టోబర్ 24 (ఆంధ్రజ్యోతి) : అనాదిగా వస్తున్న ఆచారంలో భాగంగా ఆ ఊరివారు రాత్రిపూట పుట్టలో పాలుపోసి నాగేంద్రస్వామిని కొలుసుకున్నారు. ఆసక్తికరంగా సాగిన ఈ వేడుకకు సంబంధించిన వివరాలివి. దీపావళి వేడుకలు రాత్రిపూట, నాగుల చవితిని పగటిపూట జరుపుకోవడం అందరికీ తెలిసిందే. కానీ మునగపాక మండలంలో ఉన్న వెంకటాపురం గ్రామంలో మాత్రం విభిన్నంగా చేస్తారు. నాగుల చవితి వేడుకలను ఇక్కడి వారంతా చీకటిపడిన తరువాత ఆకాశంలో చుక్కలను చూసి పుట్టలో నాగేంద్రుడికి పాలు పోస్తారు. ఇదే తంతును శుక్రవారం ఇక్కడ నిర్వహించడంతో అంతా ఆసక్తిగా తిలకించారు. సర్పంచ్, మాజీ సర్పంచ్ సుందరపు నీలకంఠస్వామి, సుందరపు వెంకట కనక అప్పారావు కుటుంబీకులు పుట్టకు వెళ్లి పూజలు చేసి పాలు పోశారు. ఈ కార్యక్రమంలో పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

ఎలమంచిలి పట్టణంలో ఏర్పాట్లు పూర్తి



నాగేంద్ర కాలనీలో సర్వాంగ సుందరంగా తీర్చిద్దిన నాగేంద్రస్వామి ఆలయం

ఎలమంచిలి : నాగుల చవితి వేడుకలను పురస్కరించుకుని పట్టణంలోని నాగేంద్ర కాలనీలో గల నాగేంద్రస్వామి ఆలయాన్ని సర్వాంగ సుందరంగా తీర్చిద్దారు. శనివారం ఇక్కడ ఈ వేడుక జరగనుంది. ఆలయం ఆవరణలో పుట్టపూజకు వచ్చే భక్తుల కోసం నిర్వాహకులు భారీ ఏర్పాట్లు చేపట్టారు. పట్టణంతో పాటు గ్రామీణ ప్రాంతాల నుంచి పెద్ద సంఖ్యలో విచ్చేసి ఇక్కడ పూజలు నిర్వహించనున్నారు. అదేవిధంగా నియోజకవర్గంలోని నాలుగు మండలాల నుంచి ప్రజలు ఉదయం పుట్టలకు వెళ్లి నాగేంద్రస్వామిని ఆరాధించనున్నారు.

'2013 భూసేకరణ చట్టం ప్రకారం పరిహారం ఇవ్వాలి'

అచ్యుతాపురం, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని హరిపురం, గొర్లెధర్మవరం, వెదురువాడ, మార్టూరు భూ నిర్వాసితులకు 2013 భూసేకరణ చట్టం ప్రకారం పరిహారం చెల్లించాలని రోడ్డు విస్తరణ నిర్వాసితుల సంఘం కన్వీనర్ రొంగలి రాము డిమాండ్ చేశారు. శుక్రవారం వెంకటాపురం, గొర్లెధర్మవరం భూ నిర్వాసితులతో ఆయన చర్చలు జరిపారు. హరిపురం నుంచి గొర్లెధర్మవరం, వెదురువాడ మీదుగా మార్టూరుకు వంద అడుగుల రోడ్డు మంజూరైందని, భూనిర్వాసితులకు లాభదాయకమైన టీడీఆర్ బాండ్లు ఇస్తామని అధికారులు చెప్పి మోసం చేస్తున్నారని ఆరోపిపంచారు. టీడీఆర్ బాండ్ల వల్ల మధ్యవర్తులు, బిల్డర్లకు ఉపయోగమే తప్ప సామాన్య భూనిర్వాసితునికి లాభం లేదన్నారు. అందువల్ల భూనిర్వాసితులంతా సమష్టిగా దీనిపై పోరాటం చేయాలని పిలుపునిచ్చారు., ఈకార్యక్రమంలో కె సోమునాయుడు, గొర్లె నూకరాజు, కిల్లాడి తాతబ్బాయి, పేరెడ్డి శ్రీను తదితరులు పాల్గొన్నారు.

ఉత్సాహంగా ఉమ్మడి జిల్లా క్రీడా పోటీలు

▸ స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో నిర్వహణ ▸ వందలాది మంది హాజరు ▸ ప్రతిభ చూపినవారు రాష్ట్రస్థాయికి ఎంపిక

అచ్యుతాపురం, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి) : క్రీడల్లో రాణించే వారికి ఉజ్వల భవిష్యత్ ఉంటుందని ఎమ్మెల్యే సుందరపు విజయ కుమార్ అన్నారు. స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో మం డలంలోని ఎంజేపురంలో శుక్రవారం ఏర్పాటైన ఉమ్మడి విశాఖ జిల్లా వాలీబాల్, చదరంగం పోటీలను ప్రారంభించి మాట్లాడారు. క్రీడలకు కూటమి ప్రభుత్వం అధిక ప్రాధాన్యం ఇస్తున్నట్టు చెప్పారు. అనకాపల్లి, అల్లూరి సీతారామరాజు, విశాఖ జిల్లాల నుంచి వాలీబాల్ అండర్- 17 విభాగంలో మూడు వందల మంది విద్యార్థులు పాల్గొనగా ఇందులో 15 మంది బాలికలు, 15 మంది బాలురలను రాష్ట్ర జట్టుకి ఎంపిక చేశారు. చదరంగంలో రెండు విభాగాల్లో 150 మంది హాజరుకాగా అండర్-14 విభాగంలో బాలురు ఐదుగురు, బాలికలు ఐదుగురు, అండర్-17 విభాగంలో బాలురు ఐదుగురు, బాలికలు ఐదుగుర్ని రాష్ట్రస్థాయికి ఎంపిక చేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ కరెడ్ల బుల్లెమ్మ, కరెడ్ల సూర్యప్రకాష్, పతివాడ చిన్నంనాయుడు, ప్రధానోపాధ్యాయుడు రాజరత్నకుమార్, పీడీ ధర్మి రెడ్డి రాజు తదితరులు పాల్గొన్నారు.



జ్యోతిప్రజ్వలన చేసి క్రీడా పోటీలను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే సుందరపు విజయ్‌కుమార్

మద్యం మకిలీని కూటమి ప్రభుత్వానికి అంటించేలా జగన్ ఎత్తులు

▸ రహదారుల అభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్ ప్రగడ నాగేశ్వరరావు



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న ప్రగడ నాగేశ్వరరావు

అచ్యుతాపురం, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి) : తాము చేసిన అవినీతి, అక్రమాలు, తప్పులను ఎదుటివారిపై నెట్టడంలో జగన్‌తో పాటు అతని బృందం పీహెచ్‌డీ పట్టా పొందారని రాష్ట్ర రహదారుల అభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్ ప్రగడ నాగేశ్వరరావు అన్నారు. ఇక్కడి టీడీపీ కార్యాలయంలో శుక్రవారం జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. నకిలీ మద్యం ద్వారా భారీగా అక్రమాలకు పాల్పడిన జగన్ అండ్ కో బ్యాచ్ దీనిని కూటమి నాయకులపై రుద్దేందుకు తీవ్రంగా ప్రయత్నిస్తున్నారని వివరించారు. గత ఐదేళ్లు లిక్కర్ మాఫియా నడిపి రూ.3,500 కోట్లు దోచుకున్న విషయాల నుంచి ప్రజల దృష్టి మరల్చడానికి జగన్ తీవ్రంగా కుట్రలు పన్నుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇందులో భాగంగానే చిత్తూరు జిల్లా ములకలచెరువు, ఇబ్రహీంపట్నం నకిలీ మద్యం వ్యవహారాన్ని తెరపైకి తెచ్చారన్నారు. ఎన్ని కుట్రలు పన్నినా రాష్ట్ర ప్రజలు నమ్మే స్థితిలో లేరన్నారు. మద్యం విషయంలో కూడా ఎటువంటి అవకతవకలు జరగకుండా విశాఖపట్నం, కాకినాడ, గుంటూరు, కర్నూలు, చిత్తూరుల్లో పరీక్షా కేంద్రాలను ఏర్పాటుచేసి మద్యాన్ని పరీక్షించి కల్తీని నిరోధించేలా కూటమి ప్రభుత్వం చర్యలు చేపట్టిందన్నారు. అలాగే మద్యం ఎక్కడా కల్తీ జరగకుండా డిస్టలరీలు, డిపోలు, మద్యం షాపులు, బార్లలో కూడా ఆకస్మిక తనిఖీలు జరుపుతున్నట్టు చెప్పారు. జగన్ అండ్‌కో కుట్రలను ప్రజంతా తిప్పికొట్టాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో టీడీపీ మండల అధ్యక్షుడు పీలా తులసీరామ్, లాలం శ్రీభరత్, ఇత్తంశెట్టి సన్యాసినాయుడు, గొర్లె శివన్నారాయణ మూర్తి, పెంటకోట విజయ్ తదితరులు పాల్గొన్నారు.

సబ్ జైలును సందర్శించిన సివిల్ జడ్జి

▸ ముద్దాయిల ద్వారా సౌకర్యాలపై సన్యాసినాయుడు ఆరా

ఎలమంచిలి ఎలమంచిలి, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి) : ఇక్కడి సబ్ జైలును సివిల్ జడ్జి, డీఎల్ఎస్ఏ సెక్రటరీ ఆర్.సన్యాసినాయుడు శుక్రవారం వివిధ శాఖల అధికారులతో కలిసి సందర్శించారు. ఈ సందర్భంగా ముద్దాయిలతో మాట్లాడి జైలులో వసతుల గురించి అడిగి తెలుసుకున్నారు. అంతా సత్ప్రవర్తనతో నడుచుకోవాలని సూచించారు. అనంతరం జైలు అధికారులు, సిబ్బందికి పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో అనకాపల్లి ఆర్డీవో షేక్ ఆయేషా, డిప్యూటీ డీఈవో అప్పారావు, జిల్లా వ్యవసాయాధికారి మోహన్‌రావు, తహశీల్దార్ వరహాలు, సీఐ ధనుంజయరావు, జైలు సూపరింటెండెంట్ ప్రసాదరావు, ప్యానెల్ న్యాయవాదులు బి.హరిశంకరరావు, పీవీ రమణ తదితరులు పాల్గొన్నారు.



సబ్ జైలులో సౌకర్యాలపై ఆరా తీస్తున్న సివిల్ జడ్జి సన్యాసినాయుడు

వారాహిదేవిగా భూలోకమాంబ అలంకరణ



ఎలమంచిలి, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలో పంచరాత్రి మహోత్సవాలు అత్యంత వైభవోపేతంగా జరుగుతున్నాయి. ఇందులో భాగా తులసీనగర్‌లోని భూలోకమాంబ అమ్మవారు ఐదో రోజైన శుక్రవారం వారాహిదేవి అలంకరణలో దర్శనమిచ్చారు. తొలుత వేకువజామున విశేష పూజలు నిర్వహించిన అనంతరం భక్తులకు దర్శనభాగ్యం కల్పించారు. వివిధ ప్రాంతాల నుంచి పెద్ద సంఖ్యలో తరలి రావడంతో ఆ ప్రాంతంలో కోలాహల వాతావరణం నెలకొంది.

శివాలయాలకు పూజా సామగ్రి వితరణ

ఎలమంచిలి, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి) : కార్తీక మాసం పర్వదినాలను పురస్కరించుకుని జిల్లాలోని పలు మండలాల్లో ఉన్న శివాలయాలకు వేదవిజ్ఞాన సమితి ట్రస్టు ప్రతినిధులు శుక్రవారం పూజా సామగ్రిని అందజేశారు. హైదరాబాద్‌కు చెందిన ఈ ట్రస్టు ఆధ్వర్యంలో ఉత్తరాంధ్ర ప్రతినిధి ఆడారి జోగేశ్వరరావు ఆలయాల ప్రతినిధులకు కిట్లను అందజేశారు.

స్వదేశీ సాంకేతిక ప్రాజెక్టులపై విద్యార్థులకు అవగాహన

రాంబిల్లి, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి) : శాస్త్ర సాంకేతిన విభాగం ఆధ్వర్యంలో వికసిత్ భారత్ కోసం స్వదేశీ సాంకేతిక ప్రాజెక్టు సైన్స్ అండ్ ఇండిజీనియస్ టెక్నాలజీ అన్‌వీల్స్‌పై విద్యార్థులకు శుక్రవారం అవగాహన కల్పించారు. ఇందులో భాగంగా మండలంలోని కేజీబీవీ, రాంబిల్లి, కొత్తపట్నం, పెదకలవలాపల్లిలోని ప్రభుత్వ పాఠశాలలను ప్రాజెక్ట్ ప్రిన్సిపాల్, ఇన్వెస్టిగేటర్ ఉప్పటి మధుసూదనరావు సందర్శించారు. ఈ సందర్భంగా వేదగణితం బోధనా శాస్త్రం, ఖగోళ శాస్త్రం, ప్రాచీన భారతీయ కళ, వాస్తుశాస్త్రం, ప్రాచీన పురావస్తు శాస్త్రం, నేల సంరక్షణ, చేనేత వస్త్రాలు, కుండలు, లోహ సంగ్రహణ శాస్త్రం వంటి స్వదేశీ సాంకేతిక అంశాలపై విద్యార్థులకు వివరించారు. ఈ కార్యక్రమంలో ప్రశాంతి పాలిటెక్నిక్ కళాశాల ఎన్‌సీసీ అధికారి మణికంఠ, ఎన్ఎస్ఎస్ వలంటీర్లు తదితరులు పాల్గొన్నారు.

రైతుల అభ్యున్నతే ప్రభుత్వ లక్ష్యం

▸ నక్కపల్లి పీఏసీఎస్ చైర్‌పర్సన్ బుజ్జి



రైతులకు రుణాలు అందిస్తున్న సొసైటీ చైర్‌పర్సన్ బుజ్జి

నక్కపల్లి, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): రైతుల అభ్యున్నతే ప్రభుత్వ లక్ష్యమని నక్కపల్లి సొసైటీ చైర్‌పర్సన్ కొప్పిసెట్టి బుజ్జి అన్నారు. శుక్రవారం 17 మంది రైతులకు సుమారు రూ.40.52 లక్షల రుణాలనుడైరెక్టర్ కోసూరి శ్రీను, సీఈవో శ్రీనివాస్‌తో కలిసి అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సహకార సొసైటీల ద్వారా రైతులకు మెరుగైన సేవలు అందించాలన్నదే ప్రభుత్వ లక్ష్యమన్నారు. హోం మంత్రి అనిత ఆదేశాల మేరకు వ్యవసాయ రుణాలతో పాటు ఇంటి తనఖా రుణాలను కూడా తక్కువ వడ్డీకి ఇస్తున్నామని చెప్పారు. ఈ అవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. సొసైటీ సేవల గురించి గ్రామాల్లో రైతులకు అవగాహన కల్పిస్తున్నామని ఆయన చెప్పారు.

మత్స్యకారుల అభివృద్ధికి కృషిచేయాలి

▸ మత్స్యకార సంఘం రాష్ట్ర అధ్యక్షుడు అప్పలరాజు



ధోని గోపిని సత్కరిస్తున్న నాఫ్ నాయకులు

పాయకరావుపేట, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): మత్స్యకారుల అభివృద్ధికి కృషి చేయాలని సంఘం రాష్ట్ర అధ్యక్షుడు మోసా అప్పలరాజు సూచించారు. స్థానిక నాఫ్ కార్యాలయంలో శుక్రవారం నక్కపల్లి మండలం ఉద్దండపురం స్వదేశీ మత్స్యకార సహకార సొసైటీ అధ్యక్షుడిగా ఎన్నికైన ధోని గోపి, ఉపాధ్యక్షుడిగా ఎన్నికైన దొంగల అప్పలరాజును ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రానున్న రోజుల్లో సొసైటీ అభివృద్ధితో పాటు సభ్యుల సంక్షేమానికి పాలక వర్గం కృషిచేయాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో నాఫ్ నక్కపల్లి, పాయకరావుపేట మండలాల అధ్యక్షులు ఎరిపిల్లి అప్పలరాజు, సూరాడ శ్రీనివాసరావు, సూరాగ గోపి పాల్గొన్నారు.

ఉప్పుటేరులో చేపల మృత్యువాత



మృత్యువాతపడ్డ చేపలు

నక్కపల్లి, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): రాజయ్యపేట గ్రామంలోని ఉప్పుటేరులో శుక్రవారం చేపలు మృత్యువాత పడ్డాయి. గురువారం అర్ధరాత్రి కురిసిన వర్షాలకు హెటిరో యాజమాన్యం రసాయనక వ్యర్థ జలాలను ఉప్పుటేరులోకి విడిచిపెట్టడంతోనే విలువైన మత్స్య సంపద నాశనమైపోయిందని మత్స్యకారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇదే విషయాన్ని శుక్రవారం రాజయ్యపేట గ్రామానికి వచ్చిన కలెక్టర్‌కు కూడా చెప్పారు. ఉప్పుటేరులో తరచూ చేపలు చనిపోతున్నాయని, దీనికి హెటిరో కాలుష్యమే కారణమని వారు వాపోయారు.

తుప్పలతో తిప్పలు

సత్యవరం-పెదరాంభద్రపురం రోడ్డులో వాహన చోదకుల అగచాట్లు

జంగిల్ క్లియరెన్స్ చేపట్టని అధికారులు



సత్యవరం-పెదరాంభద్రపురం రోడ్డులో పెరిగిన తుప్పలు

పాయకరావుపేట రూరల్, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): పెదరాంభద్రపురం-సత్యవరం రహదారిలో తుప్పలు ఏపుగా పెరిగిపోయాయి. రోడ్డుకిరువైపులా పిచ్చి మొక్కలు ఉండడంతో వాహనాలు ఎదురుపడితేగాని కనిపించని పరిస్థితి ఎదురవుతోంది. దీంతో వాహన చోదకులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

ఈ రహదారిలో మంగవరం, సత్యవరం, గోపాలపట్నం, పెంటకోట తదితర గ్రామాల ప్రజలు నిత్యం రాకపోకలు సాగిస్తున్నారు. రోడ్డుకిరువైపులా తుప్పలు ఏపుగా ఉండడం, మలుపుల వద్ద హెచ్చరిక బోర్డులు లేకపోవడంతో ఎదురెదురుగా వస్తున్న వాహనాలు కనిపించడం లేదు. దీంతో ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని వాహన చోదకులు భయపడుతున్నారు. రాత్రి వేళల్లో ఈ మార్గంలోప్రయాణం మరింత ప్రమాదకరంగా మారిందని ఆందోళన చెందుతున్నారు. వర్షాలు కురుస్తుండడంతో విష సర్పాలు రోడ్లపైకి వస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అయినప్పటికీ రోడ్లు భవనాల శాఖ అధికారులు జంగిల్ క్లియరెన్స్ చేయడం లేదని మండిపడుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి ఎటువంటి ప్రమాదాలు జరగముందే తుప్పలను తొలగించాలని సత్యవరం, పెదరాంభద్రపురం, గోపాలపట్నం, పెంటకోట గ్రామాల ప్రజలు, వాహన చోదకులు కోరుతున్నారు.

ఏపీటీఎఫ్ మండల అధ్యక్షుడిగా కృష్ణ

నక్కపల్లి, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): ఏపీటీఎఫ్ మండల శాఖ అధ్యక్షుడిగా ఏడిద కృష్ణ ఎన్నికైనట్టు సంఘ ప్రతినిధులు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. అలాగే ప్రధాన కార్యదర్శిగా చొక్కా అప్పలరాజు, గౌరవ అధ్యక్షుడిగా ఎస్.ఫాల్గుణరావు, ఉపాధ్యక్షులుగా దేవర నరసింహమూర్తి, అమలకోట ఏసుదేవుడు, కె.చిన్నారావు, ఉదయబాను, కార్యదర్శులుగా కె.నాగేశ్వరరావు, డి.నాగేశ్వరరావు, బి.రవి, సూర్యారావు, కృష్ణవేణి నియమితులయ్యారని చెప్పారు. జిల్లా కౌన్సిలర్లుగా కిల్లాడ శ్రీనివాసరావు, బండారు శ్రీనివాసరావు, కె.రంగబాబు ఎన్నికయ్యారన్నారు.

ఒకేషనల్ కోర్సులపై అవగాహన

నక్కపల్లి, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గొడిచెర్ల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 9, 10 తరగతుల విద్యార్థులకు ఒకేషన్ కోర్సులపై అవగాహన కల్పించారు. ఇందులో భాగంగా శుక్రవారం తుని బీఎస్ఎన్ఎల్ కార్యాలయాన్ని సందర్శించారు. పారిశ్రామిక సందర్శన వల్ల పిల్లలకు ఒక అవగాహన కలుగుతుందని ఈ సందర్భంగా హెచ్ఎం సత్యకుమార్ తెలిపారు. ఒకేషనల్ కోర్సుల్లో విద్యార్థి దశ నుంచి శిక్షణ పొందడం వల్ల ఉద్యోగ, ఉపాధి అవకాశాలు మెండుగా లభిస్తాయని ఆయన చెప్పారు.

రాజ్యాంగ దినోత్సవంపై పోటీలు

నక్కపల్లి, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చినదొడ్డిగల్లు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో రాజ్యాంగ దినోత్సవంపై విద్యార్థులకు శుక్రవారం పోటీలు నిర్వహించారు. రాజ్యాంగ దినోత్సవం గురించి విద్యార్థులకు అవగాహన ఉండాలన్న ఉద్దేశంతో వ్యాసరచన, వక్తృత్వ, క్విజ్ తదితర పోటీలు నిర్వహించారు. హెచ్ఎం వి.బాలాజీ, ఆంగ్ల ఉపాధ్యాయుడు వై.వెంకటరమణ, ప్రాథమిక పాఠశాల హెచ్ఎం నాగేశ్వరరావు పర్యవేక్షణలో ఈ పోటీలు జరిగాయి. పోటీల్లో విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు.

మెడికల్ కళాశాలల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా సంతకాల సేకరణ

పాయకరావుపేట, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): మెడికల్ కళాశాలల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా వైసీపీ నాయకులు సంతకాల సేకరణ కార్యక్రమాన్ని శుక్రవారం ప్రారంభించారు. పట్టణంలో పార్టీ కార్యాలయం వద్ద నియోజకవర్గ ఇన్‌చార్జి కంబాల జోగులు, రాష్ట్ర కార్యదర్శి చిక్కాల రామారావు పోస్టర్ ఆవిష్కరణతో పాటు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా కోటి సంతకాల సేకరణను ప్రారంభించారు. కార్యక్రమంలో జడ్పీటీసీ సభ్యుడు లంక సూరిబాబు, వైసీపీ నాయ కులు డి.బాబూరావు, జి.శ్రీనివాసరావు, డి.బాబి, డి.సాయిబాబా, ఎస్.నరసింహమూర్తి, ఎస్ఏఎస్.వర్మ, కె.సుందరలత, సిహెచ్.శ్రీనివాస్, సర్పంచ్‌లో కోడా కోటేశ్వరరావు, పన్నీరు పాపారావు, పి.నరేశ్, యజ్జల సత్యనారాయణ, కార్యకర్తలు పాల్గొన్నారు.

పోలీసులు అడ్డుకోవడం సరికాదు

సీపీఐ జిల్లా కార్యదర్శి అప్పలరాజు



పోలీస్ స్టేషన్‌లో సీపీఐ నాయకులు

పాయకరావుపేట, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): రాజయ్యపేట మత్స్యకారులకు మద్దతు తెలపడానికి వెళ్తున్న తమను పోలీసులు అడ్డుకోవడం సరికాదని సీపీఐ జిల్లా కార్యదర్శి మాకిరెడ్డి రామునాయుడు అన్నారు. శుక్రవారం జిల్లా కలెక్టర్ రాజయ్యపేట వచ్చిన నేపథ్యంలో తనతో పాటు బయలుదేరిన కార్యవర్గ సభ్యులు రావు వెంకటజగ్గారావు, జి.గురుబాబులను పోలీసులు అడ్డుకుని పాయకరావుపేట పోలీసు స్టేషన్‌కు తరలించారని చెప్పారు. రాజయ్యపేట గ్రామస్థులు తప్పితే మిగిలినవారు గ్రామంలోకి రాకూడదని పోలీసులు ఆంక్షలు పెట్టడం ఎంతవరకు సమంజసమని ఆయన ప్రశ్నించారు. పార్టీ నేత వెంకట జగ్గారావు మాట్లాడుతూ ఇప్పటికే హెటిరో, డక్కన్ రసాయన పరిశ్రమల కారణంగా సముద్రం కాలుష్యంతో మత్స్య సంపద తగ్గిపోయి మత్స్యకారులు నష్టపోతున్నారన్నారు. బల్క్ డ్రగ్ ఏర్పాటైతే మరింత నష్టం జరుగుతుందన్నారు. మత్స్యకారుల తరపున పోరాటాలు ఉధృతం చేస్తామని ఆయన తెలిపారు.

గృహ నిర్బంధం తగదు: సీపీఎం నేత అప్పలరాజు

ఎస్.రాయవరం, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): రాజయ్యపేట వెళ్లకుండా పోలీసులు తనను గృహ నిర్బంధం చేయడం తగదని సీపీఎం జిల్లా కార్యదర్శవర్గ సభ్యులు ఎం.అప్పలరాజు పేర్కొన్నారు. మొదటి నుంచి మత్స్యకారులకు మద్దతుగా నిలుస్తున్నామని, జిల్లా కలెక్టర్ రాజయ్యపేట వచ్చిన సమయంలో ఇంటి నుంచి బయటకు రాకుండా తనను నిర్బంధించడంతో పాటు కనీసం ఫోన్‌లో ఎవరితోనూ మాట్లాడకూడదని ఆంక్షలు విధించడం సరికాదని చెప్పారు. రాజయ్యపేట మత్స్యకారులకు అండగా ఉంటామని, వారి తరపున పోరాడతామని ఆయన స్పష్టం చేశారు.

అవార్డు గ్రహీతలకు సత్కారం



ఉపాధ్యాయులను సత్కరించిన దృశ్యం

నక్కపల్లి, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): పలు రంగాల్లో విశేష సేవలు అందించి అనేక అవార్డులు పొందిన ఉపాధ్యాయులను నక్కపల్లిలో ఏపీటీఎఫ్ ప్రతినిధులు శుక్రవారం ఘనంగా సత్కరించారు. ఉత్తమ ఉపాధ్యాయ అవార్డులు పొందిన సిహెచ్.అప్పలరాజు, సామాజిక సేవా కార్యక్రమాల్లో జాతీయ అవార్డులు పొందిన షెహనాజ్, స్వచ్ఛాంధ్ర అవార్డు పొందిన వేంపాడు హైస్కూల్ హెచ్ఎం వరలక్ష్మిలను ఏపీటీఎఫ్ రాష్ట్ర పూర్వ కార్యదర్శి బి.వెంకటపతిరాజు, కేకేఎల్ఎన్ ధర్మారావు, గణపతి, రంగబాబు దుశ్శాలువలతో సత్కరించి జ్ఞాపికలను బహూకరించారు.

బల్క్‌డ్రగ్ పార్కు రద్దు చేయాల్సిందే...

▸ జిల్లా కలెక్టర్ విజయకృష్ణన్‌కు మత్స్యకార మహిళల సుస్పష్టం

నక్కపల్లి, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రాజయ్యపేట ప్రాంతంలో బల్క్‌డ్రగ్ పార్కుకు వ్యతిరేకంగా మత్స్యకారులు గళం విప్పారు. జిల్లా కలెక్టర్ విజయకృష్ణన్ శుక్రవారం మత్స్యకారులతో నిర్వహించిన సమావేశంలో బల్క్‌డ్రగ్ పనులను వెంటనే ఆపించాలని కోరారు. అలాగే ఈ పార్కు ఏర్పాటైతే ఉత్పన్నమయ్యే నష్టాలపై తమ అభిప్రాయాలను వ్యక్తం చేశారు.

న్యాయం చేస్తారని ఆశిస్తున్నాం..

-గోసల కాసులమ్మ, జడ్పీటీసీ సభ్యురాలు



తరతరాలుగా సముద్రంపై ఆధారపడి బతుకున్న మత్స్యకారులను గ్రామం, సముద్రం నుంచి దూరం చేయడాన్ని మా వాళ్లు తట్టుకోలేకపోతున్నారు. మాకు అధికారులు, నాయకులను నమ్మడమే తప్ప మోసం చేయడం తెలియదు. ఈ విషయంలో మాకు న్యాయం చేస్తారని ఆశగా ఎదురుచూస్తున్నాం. ఆ రోజు హోం మంత్రి అనిత మా గ్రామానికి వచ్చి, వెళ్లేటప్పుడు కావాలని కాన్వాయ్‌ను ఆపలేదు. ఇది పొరపాటును జరిగింది. మంత్రికి సభా సాక్షిగా క్షమాపణ అడుగుతున్నాం.

ఆరోగ్యంపై ప్రభావం

-గోసల కామేశ్వరి, మత్స్యకార మహిళ



మత్స్యకార మహిళలకు హెటిరో కాలుష్యం వల్ల సంతానం కలగడం లేదు. గర్భం ధరించిన తరువాత గుండెలో రంధ్రాలు ఉన్నాయని ఒకరికి, మూత్ర పిండాలు సరిగా లేవని మరికొందరికి, పిండం సరిగా లేదని ఇంకొందరికి స్కానింగ్‌ల ద్వారా తెలుస్తుంది. వివాహితులకు గర్భసంచులు పాడైపోయాయని చెబుతున్నారు. మేము ఎలాంటి పిల్లలకు జన్మనివ్వాలో ప్రభుత్వం చెప్పాలి. అందువల్ల ప్రభుత్వం తక్షణమే స్పందించి బల్క్‌డ్రగ్‌ను రద్దు చేయాల్సిందే.

అమ్మా.. అనే పిలుపునకు దూరం

-యజ్జల మణి, మత్స్యకార మహిళ



పెళ్లయిన మహిళలకు ఏళ్లు గడుస్తున్నా పిల్లలు కలగడం లేదు. పిల్లలు లేకపోతే అత్తింటివారు ఎలా చూస్తారో అందరికీ తెలుసు. అమ్మా అనే పిలుపు మాకు దూరం కావాల్సిందేనా? తండ్రి చనిపోతే, ఆ పిల్లలను తల్లి ఎలా పెంచగలదు. అయినప్పటికీ ఎన్ని కష్టాలు వచ్చినా పెంచుతుంది. అదే తల్లి చనిపోతే పిల్లలను ఎవరు పెంచుతారు. ఇలాంటి సంఘటనలు మా రాజయ్యపేటలో ఎన్నో వున్నాయి. దీనికి కారణం హెటిరో కాలుష్యమే!

బెల్టుషాపుల భరతం పట్టండి

- పొల్యూషన్ కంట్రోల్ బోర్డు అధికారులు నిద్రమత్తు వీడాలి
- పరవాడ మండల సమావేశంలో ఎమ్మెల్యే 'పంచకర్ల'
- సభ దృష్టికి సమస్యలను తీసుకు వచ్చిన పలువురు సభ్యులు



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే రమేష్‌బాబు, చిత్రంలో ఎంపీపీ పైలా వెంకట పద్మలక్ష్మి

పరవాడ, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి) : గ్రామాల్లో మద్యం బెల్టు షాపులను తక్షణమే తొలగించాలని ఎమ్మెల్యే పంచకర్ల రమేష్‌బాబు ఆదేశించారు. మద్యం దుకాణాల యజమానులు తప్పనిసరిగా సమయ పాలన పాటించాలని లేకుంటే శాఖాపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఎంపీపీ పైలా వెంకట పద్మలక్ష్మి అధ్యక్షతన శుక్రవారం ఏర్పాటైన మండల పరిషత్ సర్వసభ్య సమావేశంలో ముఖ్య అతిథిగా మాట్లాడారు. పొల్యూషన్ కంట్రోల్ బోర్డు (పీసీబీ) అధికారులు నిద్రమత్తు నుంచి బయటకు రావాలన్నారు. పరవాడ ప్రాంతంలో పొల్యూషన్ సమస్య పెను సవాల్‌గా మారిందని, నియంత్రణకు తక్షణమే చర్యలు చేపట్టాలని ఆయన సూచించారు. అధికారులు, ప్రజా ప్రతినిధులు సమన్వయంతో ముందుకు సాగితే గ్రామాల అభివృద్ధి సాధ్యమన్నారు. ఎంఈవో జి.సాయిశైలజా మాట్లాడుతూ గతేడాది కంటే ఈ ఏడాది ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య గణనీయంగా పెరిగిందన్నారు. పరవాడ పెద్దచెరువు, ఉర చెరువులు ఫార్మా కాలుష్యం కారణంగా పూర్తిగా కలుషితమైపోయాయని దీనివల్ల రైతులు ఆయా చెరువుల నీటిని వ్యవసాయానికి వినియోగించుకోలేకపోతున్నారని పరవాడ ఎంపీటీసీ సభ్యుడు పైలా శ్రీనివాసరావు ఆవేదన వ్యక్తం చేశారు. గతంలో ఆయా చెరువుల్లో పీసీబీ అధికారులు నీటి నమూనాలను సేకరించినా ఆ పరీక్షల నివేదికలు ప్రజలకు నేటికీ తెలియజేయలేదన్నారు. దీనిపై పీసీబీ సైంటిఫిక్ అధికారి శ్యామ్ కుమార్ మాట్లాడుతూ కొంతమేర చెరువుల్లో నీరు కలుషితమైందని, కలుషితం కాకుండా చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. అగ్రికల్చర్ అసిస్టెంట్ లేకపోవడం వల్ల రైతులకు వ్యవసాయానికి సంబంధించిన సేవలు అందడం లేదని పి.బోనంగి సర్పంచ్ బండారు కల్పన సభ దృష్టికి తీసుకువచ్చారు. మండల వ్యాప్తంగా ఐదుగురు మాత్రమే వ్యవసాయశాఖ అసిస్టెంట్లు ఉన్నారని దీనివల్ల అన్ని పంచాయతీలకు పూర్తిస్థాయిలో సమయం కేటాయించ లేకపోతున్నామని మండల వ్యవసాయాధికారిణి రమాదేవి వివరించారు. ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈఈ జి.షణ్ముఖ మాట్లాడుతూ మండల వ్యాప్తంగా అన్ని మంచినీటి పథకాల ట్యాంకులకు ఇన్నర్ క్లోరినేషన్ చేయించినట్టు చెప్పారు. గ్రామాల్లో ఎక్కడైనా తాగునీటి సమస్య ఏర్పడితే తక్షణమే తమ దృష్టికి తీసుకురావాలన్నారు. రావాడ రెవెన్యూలో నిర్వహించిన రీసర్వేలో చాలా మేరకు తప్పులు దొర్లాయని, తక్షణమే సరి చేయాలని స్థానిక సర్పంచ్ మోటూరు సన్యాసినాయుడు కోరారు. రీ సర్వే సమస్యను తొందరలోనే పరిష్కరిస్తామని తహసీల్దార్ బి.నాగరాజు స్పష్టం చేశారు. పరవాడలో జల్ జీవన్‌మిషన్ పథకం కింద చేపట్టిన పనులు ఎంతవరకు వచ్చాయని సర్పంచ్ శిరపురపు అప్పలనాయుడు కోరగా పూర్తిస్థాయిలోనే పనులు పూర్తి చేశామని ఆపరేటర్లు లేకపోవడంతో టెస్టింగ్ చేయడం కుదరలేదని ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ షణ్ముఖ తెలిపారు. వ్యవసాయాధికారిణి రమాదేవి మాట్లాడుతూ ఈ ఏడాది రైతులకు కావాల్సిన యూరియాను పూర్తిస్థాయిలో సరఫరా చేశామని వెల్లడించారు. అనంతరం మరికొంత మంది సభ్యులు సమస్యలను వివరించగా, పలు అంశాలపై సభ్యులు తీర్మానం చేశారు. ఈ సమావేశంలో ఎంపీడీవో బి.రమేష్‌నాయుడు, డిప్యూటీ ఎంపీడీవో ఆర్.మురళీధర్, సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు, ఆయా శాఖల అధికారులు పాల్గొన్నారు.

513 మంది మహిళలకు వైద్య పరీక్షలు



వైద్యసేవలను పరిశీలిస్తున్న చెర్మన్ మళ్ల సురేంద్ర

అనకాపల్లి టౌన్, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి) : మహిళల ఆరోగ్య పరిరక్షణకు ప్రభుత్వం అమలు చేస్తున్న సఖీ సురక్ష పథకాన్ని అంతా సద్వినియోగం చేసుకోవాలని గవర కార్పొరేషన్ చైర్మన్ మళ్ల సురేంద్ర కోరారు. 81వ వార్డు పరిధిలోని టీశెట్టి అప్పారావు కల్యాణ మండపంలో శుక్రవారం మహిళలకు జరిగిన ఉచిత స్క్రీనింగ్ పరీక్షల శిబిరాన్ని సందర్శించి మాట్లాడారు. మహిళల ఆరోగ్యానికి కూటమి ప్రభుత్వం పెద్దపీట వేస్తున్నట్టు చెప్పారు. జీవీఎంసీ జోనల్ కమిషనర్ కె.చక్రవర్తి మాట్లాడుతూ మహిళలు ఆరోగ్యం పట్ల తగిన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఈ సందర్భంగా 513 మంది మహిళలు వైద్య పరీక్షలు చేయించుకున్నారు. ఈ కార్యక్రమంలో జీవీఎంసీ ఏపీడీ వై.సంతోష్‌కుమార్, ఆర్‌పీలు, కూటమి నాయకులు పాల్గొన్నారు.

లోడర్స్ బకాయి వేతనాలు చెల్లించాలని ధర్నా



జోనల్ కార్యాలయం ఎదుట నినాదాలు చేస్తున్న కార్మికులు

అనకాపల్లి టౌన్, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి) : జీవీఎంసీ అనకాపల్లి జోన్‌లో పనిచేస్తున్న లోడర్స్‌కు బకాయిపడిన వేతనాలను తక్షణమే చెల్లించాలని కోరుతూ వారంతా జోనల్ కమిషనర్ కార్యాలయం ఎదుట శుక్రవారం ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్.శంకరరావు మాట్లాడుతూ లోడర్స్‌కు బకాయి వేతనాలు చెల్లించకుంటే నవంబరు ఒకటో తేదీ తర్వాత ఎప్పుడైనా క్లాప్ వాహనాలను నిలుపుదల చేసి ఆందోళన చేయాల్సి ఉంటుందని హెచ్చరించారు. కాంట్రాక్టర్ కావాలనే జీతాలు చెల్లించడం లేదన్నారు. ఏటా ఒక నెల వేతనాన్ని ఇవ్వకుండా కాంట్రాక్టర్ నిలిపివేస్తున్నారని దీనిపై అధికారులు చర్యలు తీసుకోవాలని కోరారు. లోడర్స్ యూనియన్ జిల్లా ఉపాధ్యక్షుడు గంటా శ్రీరామ్, ప్రసాద్, ఎస్.భారతి, భవానీ, ఎం.భాస్కరరావు తదితరులు పాల్గొన్నారు.

చవితి వేడుకలకు వేళాయె..

- నాగేంద్రుని ఆలయాలు ముస్తాబు
- నేడు పుట్టల్లో పాలు పోయనున్న భక్తులు



ఆలయంలో కొలువుదీరిన స్వామి



అందమైన రంగులు, విద్యుద్దీపాలంకరణలో దిబ్బవీధిలోని నాగేంద్రుని ఆలయం

అనకాపల్లి టౌన్, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి) : నాగుల చవితి వేడుకలకు ఇక్కడి గవరపాలెం దిబ్బవీధిలోని వల్లీదేవసేన సమేత కల్యాణ సుబ్రహ్మణ్యస్వామి, నాగేంద్ర స్వామి తదితర ఆలయాలు ముస్తాబయ్యాయి. శనివారం తెల్లవారుజాము నుంచి వేడుకలు ప్రారంభం కానున్నాయి. ఇందులో భాగంగా గత నాలుగు రోజులుగా ఆలయ కమిటీ ఆధ్వ ర్యంలో వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. పురాతనమైన ఈ ఆలయంలో గవరపాలెం ప్రాంతీయులే కాకుండా పట్టణానికి చెందిన పలు కుటుంబాలు వచ్చి పుట్టల్లో పాలు పోసి పూజలు చేసి దర్శించుకోవడం ఆనవాయితీ. ఈ ఏడాది కూడా వేడుకలను నిర్వహించేందుకు ఆలయ కమిటీ సన్నాహాలు ప్రారంభించింది. భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా ఉండేందుకు బారికేడ్లు ఏర్పాటు చేశారు. ఆలయంతో పాటు రహదారి పొడవునా విద్యుద్దీపాలంకరణ చేపట్టారు.

పరిశుభ్రతకు ప్రశంస.. ప్లాస్టిక్ వినియోగంపై జరిమానా

- జీవీఎంసీ జోన్ అధికారుల వినూత్న కార్యక్రమం



పరిశుభ్రత పాటిస్తున్న దుకాణ యజమాని పువ్వు అందిస్తున్న దృశ్యం

అనకాపల్లి టౌన్, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలో పరిశుభ్రత పాటించిన వారికి జీవీఎంసీ అనకాపల్లి జోనల్ కమిషనర్ కె.చక్రవర్తి వినూత్నరీతిలో అభినందనలు తెలుపుతున్నారు. శుక్రవారం మెయిన్ రోడ్డులో ఆయన పారిశుధ్య విభాగం అధికారులు, సిబ్బందితో కలిసి విస్తృతంగా పర్యటించారు. మెయిన్ రోడ్డులోని దుకాణాలను క్షుణ్ణంగా పరిశీలించారు. బాలకృష్ణ బస్టాప్‌నకు ఎదురుగా ఉన్న స్వీట్స్ షాపు వద్దకు వెళ్లారు. షాపుతో పాటు పరిసర ప్రాంతాలు పరిశుభ్రంగా ఉండడంతో పాటు ప్లాస్టిక్ కవరు వినియోగించకుండా బొబ్బట్లను అరిటాకుతో అందరికీ అందజేయడాన్ని గమనించారు. దీంతో దుకాణ యజమాని భానుకు జడ్సీ అభినందించి, వార్డు కార్యదర్శి ద్వారా పువ్వును అందజేశారు. నిత్యం ఇదే మాదిరిగా ఉండేలా చూడాలని సూచించారు. రోడ్లపై చెత్త వేయకూడదని, దుకాణాలతో పాటు ఇళ్ల ముందు కూడా పరిశుభ్రతకు ప్రాధాన్యం ఇవ్వాలని సూచించారు.

ప్లాస్టిక్‌ను వినియోగిస్తే చర్యలు : జడ్సీ

ప్రభుత్వం సింగిల్ యూజ్ ప్లాస్టిక్‌ను నిషేధించినందున ప్లాస్టిక్‌ను వినియోగిస్తే చర్యలు తప్పవని జడ్సీ చక్రవర్తి స్పష్టం చేశారు. మెయిన్ రోడ్డులోని ఓ దుకాణంలో ప్లాస్టిక్ గ్లాసులు, వాటర్ ప్యాకెట్లను విక్రయిస్తుండడాన్ని గమనించిన జడ్సీ దుకాణ యజమానికి రూ.500లు జరిమానా విధించారు. ప్లాస్టిక్ వినియోగం వల్ల కలిగే అనర్థాలను, ప్రభుత్వ నిబంధనలను అక్కడివారికి వివరించారు. ఈ కార్యక్రమంలో శానిటేషన్ సూపర్‌వైజర్ రవికుమార్, శానిటేషన్ సెక్రటరీలు, సిబ్బంది పాల్గొన్నారు.

'మోతాదుకు మించి యూరియాతో తెగుళ్లు'

సబ్బవరం, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి) : మోతాదుకు మించి యూరియా చల్లడం వలన వరిలో తెగుళ్ల బెడద ఎక్కువ అవుతుం దని వ్యవసాయ శాఖ సహాయ సంచాలకుడు సీహెచ్.సుబ్రహ్మణ్యం తెలిపారు. ఇ-క్రాప్ నమోదు ప్రగతిని తెలుసుకునేందుకు శుక్రవారం ఇక్కడకు వచ్చిన ఆయన విలేకరులతో మాట్లాడారు. ఈ ఏడాది రైతాంగానికి అవసరమైన యూరియా కంటే రెండు రెట్లు ప్రభుత్వం పంపిణీ చేసిందన్నారు. మండలంలో ఈ ఏడాది 1338 హెక్టార్లు వరి సాధారణ విస్తీర్ణం కాగా, 1306 హెక్టార్లలో రైతులు నాట్లు వేశారన్నారు. శాస్త్రవేత్తల లెక్కల ప్రకారం ఎకరా వరికి 75 కిలోల యూరియాను మూడు దఫాలుగా వేసుకోవాలని సూచించారు. ఈ లెక్కన మం డలానికి 234 మెట్రిక్ టన్నులు యూరియా అవసరం కాగా 220 మెట్రిక్ టన్నులు రైతు సేవా కేంద్రాలకు వచ్చిందన్నారు. ప్రైవేటు డీలర్ షాపుల్లో 480 మెట్రిక్ టన్నులు నిలవ చేయడం జరిగిందన్నారు. అయితే రైతులు పశుగ్రాసానికి అధికంగా విని యోగించినట్టు తెలిసిందన్నారు. అదే విధంగా ఉద్యాన పంటలకు కూడా ఎక్కువగానే యూరియా వినియోగించినట్టు సిబ్బంది గుర్తించారన్నారు. మండలంలో అన్ని రకాల పంటలకు ఇక్రాప్ నమోదు జోరుగా జరుగుతుందన్నారు. వరి పంట, ఉద్యాన పంటలు వేసిన రైతులు సుమారు ఎనిమిది వేల మంది ఉండగా, ఇంత వరకూ 6,520 ఎకరాలకు క్రాప్ నమోదు జరిగిందన్నారు. ఈ నెలాఖరుకు పూర్తవుతుందన్నారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయాధికారి పోతల సత్యనారాయణ, ఏఈవో బాలరాజు, సిబ్బంది పాల్గొన్నారు.

'28న నియోజకవర్గ కేంద్రాల్లో ర్యాలీలు'



పోస్టర్ ఆవిష్కరిస్తున్న అమర్‌నాథ్, తదితరులు

అనకాపల్లి టౌన్, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర ప్రభుత్వం వైద్య కళాశాలలను పీపీపీ విధానంలోకి మార్చుతుండడాన్ని నిరసిస్తూ ఈ నెల 28వ తేదీన జిల్లాలోని అన్ని నియోజకవర్గ కేంద్రాల్లో నిరసన ర్యాలీలు నిర్వహించనున్నామని వైసీపీ జిల్లా అధ్యక్షుడు గుడివాడ అమర్‌నాథ్ తెలిపారు. స్థానిక రింగురోడ్డులోని పార్టీ కార్యాలయంలో శుక్రవారం ఇందుకు సంబంధించిన పోస్టర్‌ను ఆవిష్కరించి మాట్లాడారు. రచ్చబండ కార్యక్రమాల ద్వారా ప్రభుత్వ ద్వంద్వ వైఖరిని ప్రజలకు వివరిస్తామన్నారు. కేవలం వైద్య కళాశాలలను ప్రైవేటీకరణ చేయడానికే ప్రభుత్వం పూనుకుందని ఆరోపించారు. ఈ సమావేశంలో పార్టీ నియోజకవర్గాల ఇన్‌చార్జిలు కరణం ధర్మశ్రీ, పెట్ల ఉమాశంకర్ గణేశ్, అదీప్‌రాజు, కంబాల జోగులుతో పాటు గండి రవి, బొడ్డేడ ప్రసాద్, దిలీప్‌కుమార్, ఏడువాకల సత్యారావు, తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు స్కాలర్‌షిప్‌లు పంపిణీ



ప్రతిభ చూపిన ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు స్కాలర్ షిప్‌లు అందజేసిన దృశ్యం

కశింకోట, అక్టోబర్ 24 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని ప్రభుత్వ పాఠశాలల్లో పదో తరగతి చదువుకున్న 39 మంది విద్యార్థులకు శుక్రవారం స్కాలర్ షిప్‌లు అందజేశారు. బయ్యవరం సాగర్ సిమెంటు కంపెనీలో ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమంలో ఎంఈవోలు మూర్తి, సురేష్‌కుమార్‌లు ముఖ్య అతిథులుగా హాజరై సదర విద్యార్థులకు స్కాలర్‌షిప్‌లు, ప్రశసా పత్రాన్ని అందజేశారు. సంస్థ జనరల్ మేనేజర్ ఎన్‌వీ ప్రసాదరావు, ఏజీఎం పాండురంగారావు మాట్లాడుతూ సాగర్ సిమెంట్ కంపెనీ వ్యవస్థాపకులు సమ్మిడి వీరారెడ్డి జయంతిని పురస్కరించుకొని మండలంలోని ఉన్న 13 ప్రభుత్వ పాఠశాలల్లో పదో తరగతి చదివి స్కూల్ స్థాయిలో ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు స్కాలర్ షిప్‌లు అందజేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో పదమూడు ప్రభుత్వ పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

పోలియోపై అవగాహన ర్యాలీ



నెహ్రూచౌక్‌లో పోలియోపై అవగాహన కల్పిస్తున్న క్లబ్ ప్రతినిధులు

అనకాపల్లి టౌన్, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి) : ప్రపంచ పోలియో దినోత్సవాన్ని పురస్కరించుకొని రోటరీ క్లబ్ సభ్యులు పట్టణంలో శుక్రవారం ర్యాలీ నిర్వహించారు. సిటీ పబ్లిక్ స్కూల్ నుంచి విద్యార్థులు ప్రధాన రహదారుల గుండా ర్యాలీగా నెహ్రూచౌక్‌కు చేరుకున్నారు. ఈ సందర్భంగా క్లబ్ నిర్వాహకులు మాట్లాడుతూ పోలియో నిర్మూలనే రోటరీ క్లబ్ లక్ష్యమన్నారు. పోలియో రహిత సమాజం కోసం అంతా కృషి చేస్తున్నట్టు చెప్పారు. ఈ కార్యక్రమంలో రోటరీ క్లబ్ ప్రతినిధులు కేవీపీఎస్ ప్రకాశరావు, బి.శ్రీనివాసరావు, సర్వారావు తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి హామీ పనులపై అవగాహన



సుందరయ్యపేటలో సదస్సు నిర్వహిస్తున్న ఏపీడీ మణికుమార్

కశింకోట, అక్టోబర్ 24 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని పేరంటాలపాలెం, చెరకాం, సుందరయ్యపేట పంచాయతీల్లో ఉపాధి హామీ పథకంలో భాగంగా రానున్న ఆర్థిక సంవత్సరంలో చేపట్టనున్న పనులపై శుక్రవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా క్లస్టర్ ఏపీడీ మణికుమార్, ఎంపీడీవో చుక్కా చంద్రశేఖరరావు మాట్లాడుతూ ఉపాధి హామీ పనులను పల్లెల్లో అర్హులంతా సద్వినియోగం చేసుకోవాల్సిందిగా కోరారు. గతంలో జరిగిన పనులకు పేమెంట్లు అందాయో లేదో అడిగి తెలుసుకున్నారు. కాగా సుందరయ్యపేట గ్రామ పంచాయతీలో జరిగిన ఆడిట్‌లో కొన్ని ఫిర్యాదులు అందాయని వాటిపై విచారణ చేపట్టామని వారు చెప్పారు. ఉన్నతాధికారులకు నివేదిక సమర్పిస్తామన్నారు. ఈ సమావేశంలో ఏపీవో శ్రీనివాసరావు, సుందరయ్యపేట సర్పంచ్ బండారు వాసు, కూటమి నాయకులు బండారు సూర్యనారాయణ, మేట్లు, కూలీలు పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయం లాభదాయకం



ప్రకృతి వ్యవసాయ సిబ్బందికి అవగాహన కల్పిస్తున్న ప్రకాశ్

తుమ్మపాల, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి) : ప్రకృతి వ్యవసాయ విధానాల ద్వారా రైతులు ఆర్థికంగా అభివృద్ధి చెందవచ్చునని ప్రకృతి వ్యవసాయ యువజన టెక్నికల్ అధికారి ప్రకాశ్ పేర్కొన్నారు. రైతు సాధికార సంస్థ ఆధ్వర్యంలో సిబ్బందికి జరుగుతున్న శిక్షణ తరగతులను శుక్రవారం పరిశీలించి మాట్లాడారు. భవిష్యత్తులో ఎటువంటి పురుగు మందులు, ఎరువులు ఉండవన్నారు. ప్రకృతి వ్యవసాయ విధానంలో పండించిన ఉత్పత్తులు మాత్రమే వినియోగించడం జరుగుతుందన్నారు. ఈ ఉత్పత్తుల ద్వారా ప్రజలకు సంపూర్ణ ఆరోగ్యంతో పాటు, రైతులకు రెట్టింపు లాభం చేకూరుతుందని వివరించారు. ప్రకృతి వ్యవసాయ విధానాలను రైతులకు మరింత చేరువ చేసేలా సిబ్బంది కృషి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ప్రకృతి వ్యవసాయ విభాగం డీపీఎం లచ్చన్న తదితరులు పాల్గొన్నారు.

సమస్యలపై ఎమ్మెల్యేకు వినతి



ఎమ్మెల్యేకు సమస్యలు వివరిస్తున్న కార్పొరేటర్

లంకెలపాలెం, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి) : లంకెలపాలెం ప్రాంత సమస్యలపై ఎమ్మెల్యే పంచకర్ల రమేశ్ బాబుకు కార్పొరేటర్ రౌతు శ్రీనివాస్ ఆధ్వర్యంలో పలువురు కలిసి శుక్రవారం వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వ హయాంలో రద్దు చేసి ఏపీ టిడ్కో గృహాలను లబ్ధిదారులకు కేటాయించాలని కోరారు. గ్రామాల్లో పూర్తిస్థాయిలో సీసీ రోడ్లు, డ్రైనేజీలు నిర్మాణంతో పాటు వీధి దీపాలకు ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేశారు. ఎమ్మెల్యేను కలిసిన వారిలో నాయకులు రౌతు మూర్తి, అర్జున్, మణికంఠ, తులసాల శ్రీను, రాజు ఉన్నారు.

పశువుల్లో గాలికుంటు వ్యాధి నివారణకు బూస్టర్ టీకా తప్పనిసరి



టీకా ప్రక్రియను పరిశీలిస్తున్న డాక్టర్ చంద్రశేఖర్

సబ్బవరం, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి) : పశువుల్లో వచ్చే గాలికుంటు వ్యాధి నివారణకు బూస్టర్ టీకాను తప్పనిసరిగా వేయించాలని పశు సంవర్థక శాఖ ఉప సంచాలకుడు డాక్టర్ ఎం.చంద్రశేఖర్ సూచించారు. మండలంలోని గుల్లేపల్లి పశువైద్య కేంద్రాన్ని శుక్రవారం తనిఖీ చేశారు. అక్కడ జరుగుతన్న గాలి కుంటు వ్యాధి నివారణకు బూస్టర్ టీకా కార్యక్రమాన్ని పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ వర్షాకాలం, శీతాకాలంలో పశువుల ఆరోగ్య పరిరక్షణకు రైతులు తగిన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ బిసంధ్య, సిబ్బంది పాల్గొన్నారు.

'పాడి సంపద వృద్ధికి హెరిటేజ్ డెయిరీ కృషి'



పాడి రైతులకు మందులు అందిస్తున్న మేనేజర్

పరవాడ, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి) : పాడి రైతుల సంక్షేమానికి, పాడి సంపద వృద్ధికి హెరిటేజ్ డెయిరీ ప్రవేశపెట్టిన పథకాలను అంతా సద్వినియోగం చేసుకోవాలని డెయిరీ మేనేజర్ కూండ్రపు శేషు కోరారు. పి.బోనంగిలో శుక్రవారం ఏర్పాటు చేసిన అవగాహన సదస్సులో మాట్లాడారు. డెయిరీ ద్వారా అందిస్తున్న సేవలను వివరించారు. అనంతరం పశువైద్య శిబిరాన్ని నిర్వహించి, మందులు పంపిణీ చేశారు. పాడి రైతు ప్రమాదవశాత్తూ మరణిస్తే రూ.రెండు లక్షలు, సహజ మరణం పొందితే రూ. 50వేలు నామినీకి అందిస్తున్నట్టు చెప్పారు. ఈ కార్యక్రమంలో పాల సంఘం అధ్యక్షులు యల్లపు శివ, రమణ, సతీష్ తదితరులు పాల్గొన్నారు.

'వైద్య కళాశాలలను ప్రైవేటుపరం చేయవద్దు'

సబ్బవరం, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర ప్రభుత్వం కొత్తగా నిర్మిస్తున్న వైద్య కళాశాలలను ప్రైవేటుపరం చేయవద్దని మాజీ ఎమ్మెల్యే, వైసీపీ పెందుర్తి నియోజకవర్గ ఇన్‌చార్జి అన్నంరెడ్డి అదీప్‌రాజ్ అన్నారు. సబ్బవరంలో శుక్రవారం నిర్వహించిన రచ్చబండ కార్యక్రమంలో మాట్లాడారు. మెడికల్ కాలేజీలు ప్రైవేటుపరం చేయడం వలన ప్రజల నుంచి ఎక్కువ మొత్తంలో డబ్బులు వసూలు చేసే అవకాశం ఉందన్నారు. దీనివల్ల పేద, మధ్య తరగతి ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటారన్నారు. ఈ కార్యక్రంలో పార్టీ నాయకులు కొటాన రాము, గండి రవికుమార్, కర్రి బాబు, దెడ్డం ప్రసాద్, కాపుశెట్టి శేషుబాబు, ఎస్.ముత్యాలనాయుడు, నారాయణమూర్తి, వి.అప్పలరాజు, గవర రాజు, యడ్ల నాయుడు, బోను నాయుడు, డి. శ్రీను, కెకోటయ్య, ఐడి బాబు తదితరులు పాల్గొన్నారు.

వైసీపీ సబ్బవరం మండల అధ్యక్షుడిగా అప్పలనాయుడు



కమిటీ సభ్యులను అభినందిస్తున్న అదీప్‌రాజ్

సబ్బవరం, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి) : వైసీపీ మండల అధ్యక్షుడిగా కర్రి అప్పలనాయుడు రెండోసారి నియామకమయ్యారు. ఈ మేరకు పార్టీ కేంద్ర కార్యాలయం నుంచి వచ్చిన సూచనల మేరకు శుక్రవారం మాజీ ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్‌రాజ్ కమిటీని ప్రకటించారు. మండల ఉపాధ్యక్షులుగా యడ్ల నాయుడు, మచ్చ కోటేశ్వరరావు, ప్రధాన కార్యదర్శులుగా గొర్లె ఎర్రి నాయుడు, బొడ్డేటి మహాలక్ష్మీ నాయుడు, తుంపాల శివ, పి.అప్పలనాయుడు, కార్యదర్శులుగా విరోతి అప్పలనాయుడు, ఎస్.నాగభూషణం, అక్కిరెడ్డి అప్పారావు, గొర్లె వెంకటరమణ, గజ్జి దేముడు తదితరులను నియమించారు. ఈ సందర్భంగా నూతన కమిటీ సభ్యులు మాట్లాడుతూ పార్టీ పటిష్టతకు తనవంతు కృషి చేస్తామన్నారు.

జాబ్‌మేళాలో 54 మంది ఎంపిక



అభ్యర్థులకు నియామక పత్రాలను అందజేస్తున్న జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి రోహిణి ,ఆర్‌ఐటీఐ ప్రిన్సిపాల్

అరకులోయ, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి):నిరుద్యోగ యువతీ, యువకులకు ఉద్యోగ, ఉపాధి కల్పించాలన్న లక్ష్యంతో నైపుణ్యాభివృద్ధి సంస్థ (ఏపీఎస్‌ఎస్ డీసీ) పనిచేస్తున్నట్టు జిల్లా అధికారి డాక్టర్ .పి. రోహిణి తెలిపారు. ఏపీఎస్‌ఎస్‌డీసీ ఆధ్వర్యంలో స్థానిక ఆర్.ఐటీఐలో శుక్రవారం జాబ్‌మేళా నిర్వహించారు. జాబ్‌మేళాలో 132 మంది హాజరుకాగా, 54 మంది అభ్యర్థులు ఉద్యోగాలకు ఎంపికయ్యారన్నారు. ఇంటర్వ్యూల్లో ఎంపికైన వారికి రూ. 10 వేలనుంచి రూ. 20 వేల వరకు అందిస్తారన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్‌ఐటీఐ ప్రిన్సిపాల్ వెంకటేశ్వరరావు, నైపుణ్యాభివృద్ధి సంస్థ సిబ్బంది పాల్గొన్నారు.

ముగిసిన ఫార్మర్ మాస్టర్ ట్రైనర్ల శిక్షణ



రైతులకు సూచనలు అందిస్తున్న భాస్కరరావు

పాడేరురూరల్, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): పాడేరులో గురు, శుక్రవారాల్లో రైతు సాధికారిత సంస్థ జిల్లా ప్రాజెక్టు మేనేజర్ ఎస్‌జేవీ రామ్మోహన్‌రావు, లాలం భాస్కరరావుల మార్గదర్శకంలో పాడేరు విభాగంలో ఫార్మర్ మాస్టర్ ట్రైనర్లకు శిక్షణ కార్యక్రమాలను చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈ కార్యక్రమంలో పాడేరు ఐటీడీఏ పరిధిలోని 50 మంది ఎఫ్‌ఎంటీలు పాల్గొని ప్రకృతి వ్యవసాయ పద్ధతులు, ఆధునిక పరిజ్ఞానం తదితర అంశాలపై శిక్షణ పొందారన్నారు. పంటల వైవిధ్యం, మట్టి ఆరోగ్యం, బయో ఇన్‌పుట్ రైతులు స్వయంగా చేసుకొనే పద్ధతులపై అవగాహన కల్పించామని తెలిపారు. జిల్లాలోని ఎస్‌ఎఫ్‌ఏలు, సైన్స్ బృందాలు వారి పరిజ్ఞానాన్ని ఎఫ్‌ఎంటీలకు వివరించారన్నారు. ఎఫ్‌ఎంటీలు స్థానిక రైతులకు రసాయన ర హిత ప్రకృతి వ్యవసాయ పద్ధతులను ప్రచారం చేసి దిగుబడి పెంచి ఆర్థికంగా అభివృద్ధి చెందాలన్న లక్ష్యంతోనే ఈ శిక్షణ అందించామన్నారు. శిక్షణ పొందిన వారు ప్రాక్టికల్ డెమో, గ్రూప్ చర్చలు, ఫీల్డ్ వర్కర్ల ద్వారా మండలాల్లో అమలుచేయగలిగే స్థాయిలో ఉన్నారన్నారు.

ఆస్పత్రి కార్మికుల సమ్మె విరమణ



నిమ్మరసం అందజేసి కార్మికులతో సమ్మె విరమింపజేస్తున్న సీఐటీయూ నేత పడాల్

చింతపల్లి, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం ఆస్పత్రి కార్మికుల సమస్యలు పరిష్కరించేందుకు హామీ ఇవ్వడంతో సమ్మెను విరమించినట్టు సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు బోనంగి చిన్నయ్య పడాల్ తెలిపారు. సమస్యలపై స్థానిక ఏరియా ఆస్పత్రి కార్మికులు మూడు రోజులు విధులను బహిష్కరించి రెవెన్యూ కార్యాలయం ఎదుట రిలే నిరాహార దీక్ష చేస్తున్న విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో ప్రభుత్వ హామీతో శుక్రవారం సాయంత్రం సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు కార్మికులకు నిమ్మరసం అంద జేసి దీక్షను విరమింపజేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ గత కాంట్రాక్టర్ తప్పిదం వల్ల కార్మికుల ఈపీఎఫ్, ఈఎస్ఐ జాప్యాన్ని డిసెంబరులోగా పరిష్కరిస్తామని, బకాయి వేతనాలు చెల్లిస్తామని అధికారులు హామీ ఇచ్చారన్నారు.దీంతో కార్మికులు శనివారం నుంచి విధుల్లో చేరుతారన్నారు. సంఘం అధ్యక్ష, కార్యదర్శులు రామారావు, ఈశ్వరరావు, నాయకులు గిరిబాబు, గున్నమ్మ, రాములమ్మ,పాల్గొన్నారు.

గంజాయి కేసులో నిందితుల అరెస్టు

గోపాలపట్నం, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): గంజాయి రవాణా కేసులో పరారైన ఇద్దరు నిందితులను గోపాలపట్నం పోలీసులు అరెస్టు చేశారు. సీఐ లెంక సన్యాసినాయుడు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. అల్లూరి సీతారామరాజు జిల్లా హుకుంపేట మండలం అల్లంపుట్ గ్రామానికి చెందిన కొర్రా బాబూరావు, ముంచింగిపుట్టు మండలం జోలాపుట్‌కి చెందిన దోరా వెంకటరావు గంజాయి రవాణా కేసులో పరారీలో ఉన్నారు. గురువారం వారిని అల్లూరి జిల్లాలోనే అరెస్టుచేసి శుక్రవారం రిమాండుకు తరలించారు.

పెందుర్తిలో మరొకరు...

పెందుర్తి, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి) పరారీలో ఉన్న గంజాయి నిందితుడ్ని పోలీసులు అరెస్టు చేశారు. సీఐ కేవీ సతీశ్‌కుమార్ తెలిపిన వివరాల మేరకు అల్లూరి సీతారామరాజు జిల్లా హుకుంపేట మండలం డుంబ్రిగుడ గ్రామానికి చెందిన గెమ్మిలి శ్రీను ఈ ఏడాది ఏప్రిల్‌లో గంజాయి తరలిస్తూ పట్టుబడ్డాడు. అతడిని స్టేషన్‌కు తరలించే సమయంలో పోలీసుల కళ్లుగప్పి పరారయ్యాడు. ఈ క్రమంలో నిందితుడు పెందుర్తి రైల్వేస్టేషన్‌కు వస్తున్నాడన్న సమాచారం మేరకు శుక్రవారం పోలీసులు నిఘా పెట్టి, అతడిని అదుపులోకి తీసుకుని, కోర్టుకు తరలించారు.

'ఇళ్ల సర్వేను సద్వినియోగం చేసుకోండి'

డుంబ్రిగుడ, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): ఇళ్ల సర్వే ప్రక్రియలో లబ్ధిదారులు అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కనీస వేతనాల సలహా మండలి డైరెక్టర్ సుబ్బారావు కోరారు. రెండో విడతగా ఈ సర్వే ప్రక్రియకు ప్రభుత్వం చర్యలు చేపట్టిందన్నారు. ఈ అవకాశంతో నూతన రేషన్‌కార్డు కలిగిన పేద గిరిజనులకు మేలు చేకూరుతోందని అన్నారు. అర్హులు సంబంధిత పంచాయతీ ఇంజనీరింగ్ అసి స్టెంట్లు, లేదా వెల్ఫేర్ అసిస్టెంట్‌లను సంప్రదించాలని ఆయన ఈ సందర్భంగా సూచించారు.

మండలాల పునర్వ్యవస్థీకరణకు గ్రామసభలు



తహసీల్దార్‌కు వినతిపత్రం ఇస్తున్న భీరం పంచాయతీ ప్రజలు

జి.మాడుగుల, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి) : మండలాల పునరవ్యవస్థీకరణలో భాగంగా శుక్రవారం ఐదు పంచాయతీల్లో గ్రామ సభలు నిర్వహించారు. మద్దిగరువు మండల కేంద్రం ఏర్పాటు చేయాలని కోరుతూ భీరం, లువ్వాసింగి, నుర్మతి, బొయితిలి, కిల్లంకోట పంచాయతీలో ఈ సభలు నిర్వహించారు. ఈ సందర్భంగా భీరం, నుర్మతి, లువ్వాసింగి పంచాయతీల ప్రజలు ప్రస్తుత జి.మాడుగుల మండలంలో తమను కొనసాగించాలని తీర్మానాలు చేశారు. ఈ మేరకు తహసీల్దార్ రాజ్‌కుమార్‌కు వినతిపత్రాలు అందజేశారు. ఎస్.వి.రమణ, ఎస్.చిట్టిబాబు, కల్యాణం, సన్యాసిదొర, రత్నకుమారి, బొంజుబాబు, సోమలింగం, పోతురాజు, రామన్న, లక్ష్మయ్య, నీలకంఠం పాల్గొన్నారు.

బూసిపుట్టును ముంచంగిపుట్టు మండలంలోనే ఉంచాలి

ముంచంగిపుట్టు: తమ పంచాయతీని మండలం మార్పు చేయొద్దంటూ స్థానిక మండల పరిషత్ కార్యాలయం వద్ద శుక్రవారం బూసిపుట్టు పంచాయతీ గిరిజనులు ఆందోళన చేపట్టారు. కొత్త మండలంగా మద్దిగరువును ప్రకటించే అవకాశాలుండడంపై మద్దిగరువులోని బూసిపుట్టుని కలపవద్దంటూ గిరిజనులు నినాదాలు చేశారు. ముంచంగిపుట్టు మండలంలోనే కొనసాగించాలని సర్పంచ్ రాజమ్మ, ఎంపీటీసీ రాములమ్మ ఈ సందర్భంగా డిమాండ్ చేశారు. అనంతరం ఎంపీడీవో ధర్మారావు, సీనియర్ అసిస్టెంట్ మత్స్యరాజులనకు వినతిపత్రాన్ని అందించారు. మద్దిగరువులోని బూసిపుట్టును కలిపితే పంచాయతీ ప్రజలకు దూరభారం అవుతుందని వివరించారు. ఈ కార్యక్రమంలో వైస్ ఎంపీపీ సత్యనారాయణ, నాగేశ్వరరావు, గణపతి, సూరిబాబు, జాన్సన్, తదితరులు పాల్గొన్నారు.



ఎంపీడీవోకు వినతిఅందిస్తున్న బూసిపుట్టు సర్పంచ్,ఎంపీటీసీ తదితరులు

ధారకొండను మండలంగా ప్రకటిస్తే భూములిస్తాం

సీలేరు: జీకేవీధి మండలంలోని ధారకొండను మండల కేంద్రంగా ప్రకటిస్తే ప్రభుత్వ కార్యాలయాల కోసం ఏమీ ఆశించకుండా భూములను ఇవ్వడానికి ఈ ప్రాంత గిరిజనులు సిద్ధంగా ఉన్నారని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు సుంకరి విష్ణుమూర్తి తెలిపారు. ఈ ప్రాంత గ్రామాలు అభివృద్ధికి నోచుకోక తాము ఇబ్బందులు పడుతున్నామన్నారు. రహదారులు, తాగు, సాగునీరు, విద్య, వైద్యం, పూర్తిస్థాయిలో అందక వెనుకబడి ఉందన్నారు. మండల కేంద్రం ఏర్పాటు చేస్తే ఈ ప్రాంతం అభివృద్ధి పథంలో నడుస్తోందన్నారు. నిరుద్యోగ సమస్య తీరుతుందన్నారు. ధారకొండను మండల కేంద్రం ఏర్పాటుకు అధికారులు సహకరించాలని కోరారు.

గ్రామ స్థాయిలో వైద్య సేవలకు ప్రణాళిక

» డీఎంహెచ్‌వో కృష్ణమూర్తి నాయక్



వైద్యాధికారులతో జూమ్ కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న డీఎంహెచ్‌వో

పాడేరురూరల్, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల వారీగా గ్రామ స్థాయిలో నిర్వహించాల్సిన వైద్య సేవలపై నిర్దిష్ట వారాంతపు ప్రణాళికను సిద్ధం చేయాలని డీఎంహెచ్‌వో డి.కృష్ణమూర్తి నాయక్ ఆదేశించారు. జిల్లాలోని 64 పీహెచ్‌సీలలో విధులు నిర్వహిస్తున్న ప్రోగ్రాం అధికారులు, మలేరియా సబ్ యూనిట్ అధికారులు, ఆరోగ్య పర్యవేక్షకులతో శుక్రవారం ఆయన జూమ్ కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మాతా శిశు సేవలు,అన్నిరకాల వైద్య సేవలపై ప్రతీ శుక్రవారం సాయంత్రం 3 గంటల నుంచి 5 వరకు జూమ్ కాన్ఫరెన్స్ నిర్వహిస్తామన్నారు. లక్ష్యాలు, సాధించిన ఫలితాల రిపోర్టులతో సిద్ధం కావాలన్నారు.క్షయ రోగిని ఎప్పటికప్పుడు పర్యవేక్షించి, గడువులోగా మం దులు తీసుకొనేలా చూడాలన్నారు. ఆయుష్మాన్ ఆరోగ్య మందిర్ కార్యక్రమం ద్వారా 12 రకాల వైద్య సేవలను కమ్యూనిటీ హెల్త్ ఆ ఫీసర్లు రోజుకు 25 మందికి రోగ నిర్ధారణ పరీక్షలు జరిపి చికిత్సలు అందించాలన్నారు. గర్భిణులను సకాలంలో గుర్తించాలని, మాతా శిశువులకు సకాలంలో వ్యాధి నిరోధక టీకాలు అందించి ఆన్‌లైన్‌లో సేవలను అప్‌డేట్ చేయాలని ఆదేశించారు. స్కూల్ హెల్త్ కార్యక్రమం ద్వారా విద్యార్థులకు మెరుగైన వైద్య సేవలందించాలన్నారు. జిల్లా మలేరియా అధికారి వీబీడీ కన్సల్టెంట్, ఆరోగ్య విస్తరణాధికారులు కీటక జనిత వ్యాధులు, తీసుకుంటున్న చర్యలపై డీఎంహెచ్‌వో కార్యాలయానికి నివేదికలను సమర్పించాలని ఆదేశించారు. గంజాయి, మత్తు మందులకు బానిసైన చిన్నారులను ప్రభుత్వ జనరల్ ఆస్పత్రి పాడేరులో చేర్పించి మానసిక వైద్య నిపుణులు ద్వారా వైద్య సేవలు అం దిస్తున్నామన్నారు. ఈ సమావేశంలో ఏడీఎంహెచ్‌వో డాక్టర్. టీఎస్.ప్రతాప్, జిల్లా క్షయ అధికారి డాక్టర్. ఎం.కిరణ్‌కుమార్, జిల్లా వ్యాధి నిరోధక అధికారి డాక్టర్. సీహెచ్. కమలకుమారి, పీవోడీటీపీ బి.భారతి, మలేరియా అధికారి తులసి పాల్గొన్నారు.

వ్యాసరచన పోటీలు



బహుమతులను అందజేస్తున్న ఎస్ఐ సురేశ్

గూడెంకొత్తవీధి, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): బాలికలు లైంగిక వేధింపులపై చైతన్యవంతులు కావాలని స్థానిక ఎస్ఐ కె. సురేశ్ తెలిపారు. శుక్రవారం స్థానిక బాలికల ఆశ్రమ, కస్తూర్బా పాఠశాల, ఏపీఆర్ కళాశాలల్లో పోలీసు అమరవీరుల సంస్మరణ వారోత్సవంలో భాగంగా లైంగిక వేధింపుల నిరోధంపై విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించారు. విజేతలకు ఎస్ఐ బహుమతులను అందజేశారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ బాలికలు మంచి స్పర్శ, చెడు స్పర్శపై అవగాహన కలిగి ఉండాలన్నారు. విద్యార్థులను వేధింపులకు గురిచేస్తే మహిళా కానిస్టేబుల్, పోలీసుల ద్వారా సహాయం పొందవచ్చునన్నారు. చట్టాలపై అవగాహన కలిగి ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ వరలక్ష్మి పాల్గొన్నారు.

పాఠశాల భవనానికి రూ. 14.5 లక్షలు మంజూరు



సంతనేరేడుపల్లిలో సమావేశమైన విద్యా కమిటీ, సచివాలయం సిబ్బంది

సీలేరు, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): జీకేవీధి మండలం దుప్పులవాడ పంచాయతీ పరిధిలోని సంతనేరేడుపల్లి ఎంపీపీ పాఠశాలకు మనబడి మన భవిష్యత్తులో భాగంగా రాష్ట్ర ప్రభుత్వం అదనపు తరగతి నిర్మాణానికి రూ. 14.5 లక్షలు మంజూరు చేసినట్లు ప్రధానోపాధ్యాయిని ధనలక్ష్మి తెలిపారు. ఈ మేరకు శుక్రవారం పాఠశాల ఆవరణలో విద్యా కమిటీ, విద్యార్థుల తల్లిదండ్రులు, సచివాలయం సిబ్బంది సమక్షంలో సమావేశం నిర్వహించారు. పాఠశాల భవన నిర్మాణానికి చేపట్టాల్సిన చర్యలపై చర్చించారు. గ్రామంలో 1998లో నిర్మించిన పాఠశాల భవనం శిథిలావస్థకు చేరుకుందని, దీంతో విద్యార్థులకు తీవ్ర అవస్థలు ఎదుర్కొన్నట్టు ఆమె ఈ సందర్భంగా తెలిపారు. సమస్యను తాను, విద్యార్థుల తల్లిదండ్రులు అధికారుల దృష్టికి విన్నవించడంతో అదనపు భవనాన్ని మంజూరు చేశారన్నారు. ఈ భవన నిర్మాణానికి మనబడి, మన భవిష్యత్తు కమిటీని ఏర్పాటు చేశామన్నారు. ఇందులో కన్వీనర్‌గా హెచ్‌ఎం, ఎంఎంసీ చైర్మన్‌గా కిల్లో అర్జున్, వైస్ చైర్మన్‌గా కిల్లో రాధ, వెల్ఫేర్ గా ము గ్గురు సభ్యులు, కాంప్లెక్సు సీఆర్పీ ఎడ్యుకేషన్ అసిస్టెంట్ రాజేశ్, సచివాలయం ఇంజనీరింగ్ అసిస్టెంట్ కుసుమ సభ్యులుగా ఉంటారు. వీరు, విద్యార్థుల తల్లిదండ్రుల కమిటీ సభ్యులు భవన నిర్మాణం పూర్తి చేయాల్సి ఉంది.

చట్టాలపై అవగాహన అవసరం: ఎస్ఐ



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న ఎస్ఐ వెంకట రమణ

చింతపల్లి, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని స్థానిక ఎస్ఐ ఎం. వెంకటరమణ అన్నారు. శుక్రవారం స్థానిక ప్రభుత్వ డిగ్రీ, జూనియర్ కళాశాలలో విద్యార్థులకు లైంగిక వేధింపుల నుంచి మహిళలు, బాలబాలికల రక్షణ అనే అంశంపై వ్యాసరచన పోటీలు నిర్వహించారు. విజేతలకు బహుమతులను అందజేశారు. ఈసందర్భంగా ఎస్ఐ లైంగిక వేధింపులు, తీసుకోవాల్సిన జాగ్రత్తలు, చట్టాలు, రక్షణ అంశాలను వివరించారు. ఈకార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాకర్ ఎం. విజయభారతి, అధ్యాపకులు పాల్గొన్నారు.

తహశీల్దార్ సేవలు అభినందనీయం



బదిలీపై వెళుతున్న తహశీల్దార్ ఆనందరావుని సన్మానిస్తున్న ఉద్యోగులు

చింతపల్లి, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): అనకాపల్లి జిల్లాకు డిప్యూటేషన్ బదిలీపై వెళుతున్న తహశీల్దార్ జి. ఆనందరావు సేవలు అభినందనీయమని స్థానిక ఉప తహసీల్దార్ ఎస్. నరేంద్ర బాబు అన్నారు. శుక్రవారం కలెక్టర్ ఆనందరావుని అనకాపల్లి జిల్లాకు బదిలీ చేస్తూ ఉత్తర్వులు జారీచేశారు. ఈ మేరకు రెవెన్యూ కార్యాలయం ఉద్యోగులు ఆయనను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఉప తహశీల్దార్ మాట్లాడుతూ విధుల్లో చేరిన మూడు నెలల్లో ఆనందరావు ఉత్తమ సేవలందించారన్నారు. ప్రజలకు అందుబాటులో ఉంటూ పట్టాదారు పాస్ పుస్తకాల మ్యూటేషన్, నూతన రేషన్ కార్డులు, కులం, ఆదాయ ధ్రువీకరణ పత్రాలు జారీలోప్రత్యేక చొరవ తీసుకున్నారన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్ఐ కృష్ణమూర్తి, వీఆర్‌వోలు పాల్గొన్నారు.

చింతపల్లి తహశీల్దార్‌గా శంకరరావు



చింతపల్లి, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): స్థానిక మండల రెవెన్యూ తహశీల్దార్‌గా కె. శంకరరావు నియమితులయ్యారు. పరిపాలన సౌలభ్యంలో భాగంగా స్థానిక తహశీల్దార్ జి. ఆనందరావుని అనకాపల్లి డిప్యూటేషన్‌పై బదిలీ చేయగా ఆయన స్థానంలో ముంచంగిపుట్టు తహశీల్దార్ కె. శంకరరావుని డిప్యూటేషన్‌పై నియమించారు. ఈమేరకు శుక్రవారం ఆ యన బాధ్యతలు స్వీకరించారు. మండల ప్రజలకు మెరుగైన సేవలందించేందుకు కృషి చేస్తామని ఆయన తెలిపారు.

ఉచిత వైద్య సేవలు



కోడిమామిడిలో వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యాధికారి

జి.మాడుగుల, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి) : ఆంధ్ర వనవాసీ కల్యాణ్ ఆశ్రమం ద్వారా గిరిజనులకు ఉచిత వైద్య సేవలు అందిస్తున్నట్లు ఆ సంస్థ వైద్యాధికారి డి.శ్రీనివాసరావు తెలిపారు. గురువారం పాలమామిడి పంచాయతీ కొంతలం, వనభంగి పాడు, శుక్రవారం కిల్లంకోట పంచాయతీ కోడిమామిడి, కె.బందవీధి గ్రామాల్లో ఉచితంగా వైద్య సేవలు అందించి మందులు అందజేసినట్టు చెప్పారు. అవసరమైన వారికి ఆపరేషన్లకు ఉచితంగా చేయిస్తామని స్పష్టం చేశారు. తమ ఆశ్రమం ద్వారా దేశ వ్యాప్తంగా గిరిజనులకు ఉచిత సేవలు అందిస్తుందని పేర్కొన్నారు.

గిరిజన సమాఖ్య జిల్లా సభలను విజయవంతం చేయాలి

పాడేరురూరల్, అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి): అల్లూరి జిల్లా మారేడుమిల్లులో ఈ నెల 30వ తేదీన జరగనున్న ఆంధ్రప్రదేశ్ గిరిజన సమాఖ్య జిల్లా రెండవ మహాసభలను విజయవంతం చేయాలని గిరిజన సమాఖ్య జిల్లా ప్రధాన కార్యదర్శి కూడా రాధాకృష్ణ కోరారు. గిరిజన సమాఖ్య జిల్లా కార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ గిరిజన ప్రాంత ప్రజల సమస్యల పరిష్కారానికి, హక్కుల సాధనకు, పార్టీ బలోపేతానికి నిర్వహిస్తున్న ఈ మహాసభకు సీపీఐ పార్టీ జాతీయ కార్యదర్శి రామకృష్ణ, రాష్ట్ర కార్యదర్శి జి.ఈశ్వరరావు, సహాయ కార్యదర్శి జేవీ సత్యనారాయణమూర్తి, ఏపీ గిరిజన సమాఖ్య రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు శారయ్య, ఆంజనేయులు హాజరవుతారన్నారు.జిల్లా పరిధిలోని 22 మండలాల నుంచి పార్టీ శ్రేణులు, అభిమానులు అధిక సంఖ్యలో పాల్గొని సభను విజయవంతం చేయాలని ఆయన కోరారు. తదితరులు పాల్గొంటారన్నారు. అనంతరం పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో సమాఖ్య జిల్లా నాయకులు ఎస్.లక్ష్మణ్, చంటిబాబు, సుబ్బారావు, ఏఐవైఎఫ్ నాయకులు ఎం.లక్ష్మణరావు పాల్గొన్నారు.

రాగల ఐదు రోజుల్లో తేలికపాటి వర్షాలు

చింతపల్లి, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో రాగల ఐదు రోజుల్లో తేలికపాటి వర్షాలు కురుస్తాయని స్థానిక ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానం ఏడీఆర్, వాతావరణ విభాగం నోడల్ అధికారి డాక్టర్ ఆళ్ల అప్పలస్వామి తెలిపారు. శుక్రవారం రాగల ఐదు రోజుల వాతావరణ సమాచారాన్ని శాస్త్రవేత్తలు ప్రకటించారు. ఈనెల 29 వరకు రంపచోడవరం, చింతపల్లి, పాడేరు, అరకు డివిజన్ల పరిధిలో కనిష్ఠంగా 5.8మిల్లీ మీటర్ల నుంచి గరిష్ఠంగా 30మిల్లీ మీటర్ల వర్షపాతం నమోదవుతుందని ఏడీఆర్ తెలిపారు. గాలిలో తేమ 84-88 శాతం ఉంటుందన్నారు.

అనారోగ్య బాధితుడికి ఆర్థిక సాయం



బాధితుని భార్యకు ఆర్థిక సాయం అందిస్తున్న టూరిజం జేఏసీ ప్రతినిధులు

అరకులోయ, అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి): స్థానిక హరిత వేలీ రిసార్టులో పనిచేస్తున్న టూరిజం ఉద్యోగి ఎం.సుందర్ కిడ్నీ సమస్యతో విశాఖపట్నం గీతం ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. అతనిని నిరుపేద కుటుంబం కావడంతో టూరిజం ఉద్యోగులం దరి నుంచి రూ.74వేలు విరాళంగా సేకరించారు. ఈ నగదు టూరిజం జేఏసీ ప్రతినిధులు ప్రసాద్, నరసింహ, విశాఖపట్నం హరిత రిసార్ట్ మేనేజర్ పాత్రుడు, నూకరాజు శుక్రవారం ఆసుపత్రికి వెళ్లి సుందర్ భార్యకు అందజేశారు. రెండు కిడ్నీలు పాడై చికిత్సపొందుతున్న సుందర్ చికిత్సకు సాయం అందించాలని ఉన్నతాధికారులను వారు కోరారు.

పాఠశాలల తనిఖీ

డుంబ్రిగుడ, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): పిల్లల్లో విద్యా ప్రమాణాలు మెరుగు పరచాల్సిన బాధ్యత ఉపాధ్యాయులపై ఎంతైనా ఉందని స్థానిక ఎంఈవో-2 గెన్ను అన్నారు. మండలంలోని చినఅంజోడ, పెదఅంజోడ, సాయినగర్ ప్రాథమిక పాఠశాలలను శుక్ర వారం ఆయన ఆకస్మిక తనిఖీ చేశారు. పిల్లల విద్యా ప్రమాణాలను పరిశీలించిన ఆయన సంతృప్తి వ్యక్తం చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ మధ్యాహ్నం భోజన పథకం తప్పకుండా అమలు చేయాలని ఆదేశించారు. చిన్నారులకు క్రమశిక్షణతో కూడిన విద్యనందించాలని కోరారు. ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

'హైడ్రో' ప్రాజెక్టులకు వ్యతిరేకంగా ఆందోళన

» పాడేరులో గిరిజనుల భారీ ర్యాలీ



ఆందోళనకారులను ఉద్దేశించి మాట్లాడుతున్న కలెక్టర్ దినేశ్‌కుమార్

పాడేరు, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): మన్యంలో హైడ్రో పవర్ ప్రాజెక్టుల నిర్మాణాన్ని వ్యతిరేకిస్తూ గిరిజనులు శుక్రవారం జిల్లా కేంద్రం పాడేరులో ఆందోళన చేశారు. స్థానిక ప్రభుత్వ జూనియర్ కాలేజీ మైదానం నుంచి కలెక్టరేట్‌కు ర్యాలీ నిర్వహించి, ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా సీపీఎం కేంద్ర కమిటీ సభ్యుడు కొత్తపల్లి లోకనాథం మాట్లాడుతూ గిరిజనుల అభిష్టానికి వ్యతిరేకంగా ఏజెన్సీలో ఎటువంటి ప్రాజెక్టులు నిర్మించడానికి వీలు లేదన్నారు. పవర్ ప్రాజెక్టుల నిర్మాణ ప్రతిపాదనలను ప్రభుత్వం పూర్తిగా ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. కలెక్టరేట్ ఎదుట ఆందోళన చేస్తున్న ఆందోళనకారుల వద్దకు వచ్చిన కలెక్టర్ ఏఎస్.దినేశ్‌కుమార్ మాట్లాడుతూ హైడ్రో పవర్ ప్రాజెక్టుల పనులను గ్రామసభల ఆమోదం లేకుండా చేయబో మన్నారు. హైడ్రో పవర్ ప్రాజెక్టులపై ప్రజలకు అవగాహన కల్పించేందుకు ఈనెల 27న కలెక్టరేట్‌లో సమావేశం నిర్వహిస్తున్నామన్నారు. అది ప్రజాభిప్రాయ సేకరణ కాదని, కేవలం ప్రజలకు అవగాహన కల్పించేందుకు మాత్రమేనని ఆయన స్పష్టంచేశారు. చలో కలెక్టరేట్ నేపథ్యంలో ఎటువంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా డీఎస్పీ షహబాజ్ అహ్మద్ పర్యవేక్షణలో సీఐ డి.దీనబంధు ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలో గట్టిబందోబస్తు ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో గిరిజన సంఘం జాతీయ కమిటీ సభ్యుడు పి.అప్పలనర్స, రాష్ట్ర కార్యదర్శి కిల్లో సురేంద్ర, అనంతగిరి జడ్పీటీసీ సభ్యులు డి.గంగరాజు, సీపీఎం నేతలు పోతురాజు, వి.ఉమామహేశ్వరరావు, గిరిజన సంఘం నేతలు ధర్మన్న పడాల్, బాలదేవ్, కృష్ణారావు, సురేశ్‌కుమార్, స్వామి, దశరథ్, అధిక సంఖ్యలో గిరిజనులు పాల్గొన్నారు.

ఊటగెడ్డ నీరు మళ్లింపు

» 'ఆంధ్రజ్యోతి' ఎఫెక్ట్

అనంతగిరి, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రానికి సమీపంలోని అరకు-విశాఖ ప్రధాన రహదారిపైకి ఊటగెడ్డ నీరు ప్రవహిస్తుండడంతో ఈ మార్గం అధ్వానంగా మారింది. దీనిపై ఈనెల 22 తేదీన 'ఊటగెడ్డ నీటి ప్రవాహంతో రోడ్డు ఛిద్రం' శీర్షికన 'ఆంధ్ర జ్యోతి'లో వచ్చిన కథనానికి పంచాయ తీ కార్యదర్శి దేవా స్పందించారు. రోడ్డును ఆనుకుని డ్రైనేజీ వ్యవస్థ లేక రోడ్డుపై నీరు ప్రవహిస్తోంది. పంచాయతీ పారిశుధ్య కార్మికులు రవి, అప్పల్‌ను పం పించి, రోడ్డుపైకి నీరు రాకుండా తాత్కాలికంగా కాలువలను తీయించి, నీటిని పక్కకు మళ్లించారు. దీంతో కొంత వరకు సమస్య తప్పింది. హైవే అధికారులు స్పందించి సమస్యపై శాశ్వత పరిష్కార చర్యలు చేపట్టాలని కోరారు.



నీటిని రోడ్డుపైకి రాకుండా కాలువ తీస్తున్న పారిశుధ్య కార్మికులు

పంచాయతీల్లో పారిశుధ్యం మెరుగుకు చర్యలు



కొత్తూరులోని పారిశుధ్యం పనులను పర్యవేక్షిస్తున్న ఎంపీడీవో ధర్మారావు, సర్పంచ్

ముంచంగిపుట్టు, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): ప్రతి పంచాయతీలోని పారిశుధ్యం మెరుగునకు ప్రత్యేక చర్యలు చేపడుతున్నట్టు స్థానిక ఎంపీడీవో ధర్మారావు తెలిపారు. మండలంలోని వనభంగి పంచాయతీ కొత్తూరు గ్రామంలో సర్పంచ్ లక్ష్మణ్, కార్యదర్శి సూర్యనారాయణ ఆధ్వర్యంలో శుక్రవారం ప్రత్యేక డ్రైవ్‌లో భాగంగా చేపట్టిన పారిశుధ్య పనులను ఎంపీడీవో పర్యవేక్షించి పలు సూచనలు చేశారు. గ్రామాల్లో ప్రతి ఒక్కరు స్వచ్ఛతకు సహకరించాలని సూచించారు.

ఎంఎల్‌ఎస్ గోదాము ఇన్‌చార్జిగా చిన్నబ్బాయి



ఉత్తర్వులను అందజేస్తున్న జీసీసీ బ్రాంచి మేనేజర్ సుగునాథం

చింతపల్లి, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): స్థానిక గిరిజన సహకార సంస్థ ఎంఎల్‌ఎస్ గోదాం ఇన్‌చార్జిగా శెట్టి చిన్నాబ్బాయిని నియమిస్తూ డివిజనల్ మేనేజర్ బుక్కా వెంకటేశ్ ఉత్తర్వులు జారీచేశారు.ఈ గోదాము ఇన్‌చార్జిగా పనిచేస్తున్న ఎంవీ రమణమూర్తిని సీలేరు జీసీసీ పెట్రోల్ బంక్ ఇన్‌చార్జిగా బదిలీ చేయగా, ఆయన స్థానంలో తాజంగి సీనియర్ సేల్స్‌మన్‌గా పనిచేస్తున్న చిన్నబ్బాయిని ఇక్కడ నియమించారు. శుక్రవారం నియామక ఉత్తర్వులను బ్రాంచి మేనేజర్ చల్లంగి సుగునాథం అందజేశారు. శనివారం ఆయన విధుల్లో చేరనున్నారు.

జీవీఎంసీ కమిషనర్‌ను కలిసిన మాడుగుల ఎమ్మెల్యే బండారు



కె.కోటపాడు, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): జీవీఎంసీ కమిషనర్ కేతన్ గార్గ్‌ను మాడుగుల ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి శుక్రవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఇటీవల కృష్ణారాయుడుపేట దగ్గర రైవాడ కాలువపై ఉన్న బ్రిడ్జి కూలిపోయిందని, వారం రోజుల్లో బ్రిడ్జి పనులు ప్రారంభించాలని, విశాఖపట్నానికి రైవాడ రిజర్వాయర్ నుంచి తాగునీరు తీసుకుంటున్నందుకు బిల్లు బకాయిలను ఇవ్వాలని కోరారు. అనంతరం విశాఖపట్నం మేయర్ పీలా శ్రీనివాస్‌ను కలిశారు.

సీసీ కెమెరాలకు మరమ్మతులు

▸▸ కొత్త మెమోరీ కార్డులు అమర్చుతున్న సిబ్బంది



ఆర్టీసీ కాంప్లెక్ ఆవరణలో సీసీ కెమెరాకు మెమోరీ కార్డు ఏర్పాటు చేస్తున్న దృశ్యం

నర్సీపట్నం, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ప్రధాన కూడళ్లలో సీసీ కెమెరాలను సాంకేతిక సిబ్బంది మరమ్మతులు చేసి కొత్తగా మెమోరీ కార్డులు అమర్చుతున్నారు. రోడ్డు ప్రమాదాలు, దొంగతనాలు, ప్రభుత్వ వ్యతిరేక ఆందోళనలు, ఇతర నేరాలు జరిగినప్పుడు పోలీసుల విచారణకు సీసీ పుటేజీల ఉపయోగం చాలా ఉంటుంది. వీటికి సంబంధించి కమాండ్ కంట్రోల్ రూమ్ మంగళగిరిలో ఉంది. నేర విచారణలో సీసీ పుటేజీలు అవసరమైతే స్థానిక పోలీసులు అక్కడి నుంచే తీసుకుంటారు. శుక్రవారం ఆర్టీసీ డిపో ఆవరణలోని సీసీ కెమెరాలు మరమ్మతులు చేసి మెమోరి కార్డు మార్చారు. పట్టణంలోని ప్రధాన కూడళ్లలో సుమారు 28 సీసీ కెమెరాలకు మరమ్మతులు చేయిస్తున్నారు.

క్షేత్ర సహాయకుడిపై విజిలెన్స్ విచారణ



గునుపూడి క్షేత్ర సహాయకుడిపై విచారణ చేస్తున్న విజిలెన్స్ అధికారులు

నాతవరం, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గునుపూడి ఉపాధి హామీ పథకం క్షేత్ర సహాయకుడు కోరుప్రోలు వినయ్‌కుమార్‌పై శుక్రవారం విజిలెన్స్ అధికారులు విచారణ చేపట్టారు. దొంగమస్తర్లు వేస్తున్నారని ఇదే గ్రామానికి చెందిన అనిమిరెడ్డి నాగు ముఖ్యమంత్రికి ఫిర్యాదు చేశారు. దీంతో జిల్లా నిఘా విభాగం అధికాణి శ్రీలలిత సిబ్బందితో కలసి ఇంటింటికి వెళ్లి విచారణ నిర్వహించారు. నివేదికను ముఖ్యమంత్రి కార్యాలయానికి, అనకాపల్లి డ్వామా పీడీకి అందజేస్తామని ఆమె తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో ఎం.సత్యశ్రీనివాసు, ఉపాధి పథకం ఏపీవో కొండాజీ తదితరులు పాల్గొన్నారు.

రూ.2.75 కోట్లతో రెండు రోడ్ల నిర్మాణం



రోడ్డుకు శంకుస్థాపన చేస్తున్న టీడీపీ మండల నాయకులు

గొలుగొండ, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రెండు రోడ్ల నిర్మాణానికి రూ.2.75 కోట్లు మంజూరయ్యాయని టీడీపీ మండల అధ్యక్షుడు చిటికెల తారకవేణుగోపాల్ తెలిపారు. శుక్రవారం జోగంపేట-ధారమతం రోడ్డుకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జోగంపేట జంక్షన్ నుంచి సాలికమల్లవరం, గొలుగొండ గ్రామం నుంచి ధారమతం వరకు స్పీకర్ అయ్యన్నపాత్రుడు నిధులు మంజూరు చేశారన్నారు. ఈ నిధులతో రోడ్ల ఆధునికీకరణ చేపడుతున్నట్టు చెప్పారు. మరో రెండు రోడ్లకు త్వరలో శంకుస్థాపన చేస్తామని ఆయన తెలిపారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి ఎంపీడీవో ఉలబాల శ్రీనివాసరావు, ప్రాజెక్టు డీఈ సత్యనారాయణ, టీడీపీ నాయకులు ఎ.అప్పలనాయుడు, సుర్ల బాబ్జి, ఎ.గోపీ, గెడ్డం ఆనంద్, గెడ్డం నానాజీ, మామిడి ఆదిలక్ష్మి, గొల్లి సత్యనారాయణ, కొల్లాన కొండలరావు, తదితరులు పాల్గొన్నారు.

వారపు సంతకు చవితి కళ



సంతలో కళకళలాడుతున్న దుకాణాలు

రావికమతం, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో శుక్రవారం జరిగిన వారపు సంత నాగుల చవితి సందర్భంగా కిటకిటలాడింది. పూజా సామగ్రి, పండ్లు, నాగల తువ్వాళ్లు, పూలు, కోడి గుడ్లకు జనాలు ఎగబడ్డారు. ఇదే అదునుగా దుకాణదారులు డబల్ రేట్లకు విక్రయించారు. జోరు వర్షం పడుతున్నా కొనుగోలుదారులతో సంత కిక్కిరిసిపోయింది. మెయిన్ రోడ్డుకిరువైపులా దుకాణాలు ఉండ డంతో ట్రాఫిక్ స్తంభించిపోయింది. పోలీసులు క్రమబద్ధీకరించారు.

విద్యా సంస్థలకు ప్రజల సహకారం అవసరం

▸▸ స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడు



కార్యక్రమంలో మాట్లాడుతున్న స్పీకర్ అయ్యన్నపాత్రుడు

మాకవరపాలెం, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ విద్యా సంస్థలకు ప్రజల సహకారం ఎంతో అవసరమని రాష్ట్ర శాసనసభ స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడు అన్నారు. మాకవరపాలెం ప్రభుత్వ జూనియర్ కళాశాలను శుక్రవారం సందర్శించారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ కళాశాల అభివృద్ధికి ప్రభుత్వం నుంచి రూ.40 లక్షలు మంజూరు చేయిస్తానని చెప్పారు. అలాగే తనవంతు సాయంగా రూ.లక్ష విరాళం ఇస్తానన్నారు. గత ఐదేళ్లుగా ఈ కాలేజీ ఎన్నో సమస్యలతో ఇబ్బందులు పడుతుందన్నారు. కాలేజీలో విద్యార్థుల సంఖ్య తక్కువగా ఉండడంతో పాటు ఇక్కడ మౌలిక వసతులు పూర్తిస్థాయిలో లేకపోవడంపై స్పీకర్ అసహనం వ్యక్తం చేశారు. కాలేజీ సమస్యలతో కొట్టుమిట్టాడుతున్నదని తెలుసుకొని ఇక్కడికి వచ్చానని చెప్పారు. గత రెండు సంవత్సరాలుగా 161 మంది విద్యార్థులు ఉండటం ఆందోళనకరమన్నారు. కాలేజీలో మెరుగైన వసతులు, పరిశుభ్రమైన వాతవరణం కల్పిస్తే నర్సీపట్నం, అనకాపల్లి వంటి ప్రాంతాలకు వెళ్లాల్సిన అవసరం లేదన్నారు. కళాశాలల అభివృద్ధి రాజకీయాలకు అతీతమైన అంశమని స్పీకర్ తెలిపారు. తక్షణ చర్యగా భవనాల మరమ్మతులు, గ్రౌండ్ లెవెలింగ్ పనుల నిమిత్తం తనవంతుగా రూ.లక్ష విరాళంగా ప్రకటించారు. దీనికి అదనంగా దాతల నుంచి సుమారు రూ.10 లక్షలు విరాళాలు సేకరించాలని సూచించారు. అలాగే మాకవరపాలెంలో బీసీ కాలనీలో ఉన్న తార సంస్థ వద్ద ఎంపీ సీఎం రమేశ్ నిధులతో కల్యాణ మండపం నిర్మాణం చేస్తామని స్పీకర్ తెలిపారు. అనంతరం తామరం గ్రామానికి చెందిన చిరంజీవిరాజు రూ.లక్ష, జి.గంగవరం సర్పంచ్ వెంకటరమణ రూ.50 వేలు విరాళం ప్రకటించారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ భారతశ్రీ, తహసీల్దార్ వెంకటరమణ, సర్పంచ్ అల్లంపల్లి శిరిషా, ఉప సర్పంచ్ లాలం రాము, టీడీపీ మండల అధ్యక్షుడు ఆర్‌వై.పాత్రుడు, టీడీపీ నాయకులు అల్లు రామునాయుడు, జోగి పాత్రుడు, రుత్తల నాని, సర్వశిక్షా అభియాన్ ఈఈ నరసింగరావు పాల్గొన్నారు.

రెవెన్యూ అధికారులపై సభ్యుల ధ్వజం

ప్రభుత్వ భూములు ఆక్రమణలకు గురవుతున్నా ఎందుకు పట్టించుకోవడం లేదని నిలదీత

వాడీగావేడిగా మండల సర్వసభ్య సమావేశం



సర్వసభ్య సమావేశంలో రెవెన్యూ అధికారులను ప్రశ్నిస్తున్న సర్పంచ్ పైడినాయుడు

బుచ్చెయ్యపేట, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): రెవెన్యూ అధికారుల తీరుపై ప్రజా ప్రతినిధులు ధ్వజమెత్తారు. ప్రభుత్వ భూములు ఆక్రమణలకు గురవుతున్నా ఎందుకు పట్టించుకోవడం లేదని నిలదీశారు. మండల పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో ఎంపీపీ దాకవరపు నాగేశ్వరిదేవి శుక్రవారం నిర్వహించిన సర్వసభ్య సమావేశం వాడీవేడిగా సాగింది. పోలేపల్లి సర్పంచ్ సీతా పైడినాయుడు మాట్లాడుతూ పోలేపల్లిలో రోడ్డుకు ఆనుకుని సర్వే నంబర్ 156లో 216 ఎకరాల ప్రభుత్వ భూమిలో కొంత కాలంగా ఆక్రమణలు జరుగుతున్నాయని, భూమిని చదును చేసి మొక్కలు నాటుతున్నారని తెలిపారు. దీనిపై రెవెన్యూ అధికారులకు సకాలంలో సమాచారం అందించినా స్పందించ లేదని మండిపడ్డారు. ప్రభుత్వ భూములు అక్రమణలకు గురైతే భవిష్యత్తులో ప్రజావసరాలకు ఒక్క సెంటు కూడా మిగలదన్నారు. తక్షణమే మొక్కలు తొలగించి సదరు భూములను ప్రభుత్వం స్వాధీనం చేసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. వైస్ ఎంపీపీ దొండా లలిత నారాయణమూర్తి మాట్లాడుతూవడాదిలో 400 ఎకరాల జిరాయితీ భూమి ఇనామ్‌లో నమోదు చేశారని, దీనివల్ల క్రయవిక్రయాలు నిలచిపోయాయని తెలిపారు. వడ్డాదిలో రీ సర్వే జరగలేదని, ఈ సమస్య 15 రోజులలో పరిష్కరించకపోతే తహశీల్దార్ కార్యాలయం ఎదుట రైతులతో ఆందోళన చేస్తామని హెచ్చరించారు. తహశీల్దార్ ఎం.లక్ష్మి స్పందిస్తూ పోలేపల్లిలోని ప్రభుత్వ భూమిలో ఆక్రమణలు తొలగిస్తామని చెప్పారు. వడ్డాదిలో ఇనాం భూముల సమస్యను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్తామన్నారు. విద్యుత్ సమస్యల పరిష్కారంలో అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని భాగంగా ఆర్.భీమవరం, మల్లాం ,పెదపూడి సర్పంచులు బర్ల శివ, గొకివాడ వరకృష్ణ, తురకలపూడి పీఏసీఎస్ అధ్యక్షుడు కొట సత్యనారాయణ తదితరులు ధ్వజమెత్తారు. జడ్పీటీసీ సభ్యుడు దొండా రాంబాబు మాట్లాడుతూ ప్రజా ప్రతినిధులు లేవనెత్తిన సమస్యలపై అధికారులు వెంటనే స్పందించి, సత్వరమే పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని కోరారు. అలాగే సమావేశానికి గైర్హాజరైన అధికారులపై చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ సమావేశంలో ఎంపీడీవో శివప్రసాద్ నారాయణరావు, డిప్యూటీ ఎంపీడీవో లవరాజు, ఎంపీటీసీ సభ్యులు, సర్పంచులు పాల్గొన్నారు.

భారీ వర్షం.. లోతట్టు ప్రాంతాలు జలమయం





చోడవరం ప్రధాన రహదారిలో కురుస్తున్న వర్షం... కృష్ణాదేవిపేటలో పడుతున్న వాన

చోడవరం, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): బంగాళాఖాతంలో వాయుగుండం ప్రభావంతో శుక్రవారం మధ్యాహ్నం భారీ వర్షం పడింది. ఉదయం నుంచి ఎండ కాసింది. మధ్యాహ్నం వాతావరణం పూర్తిగా మారిపోయింది. తరువాత వర్షం మొదలైంది. సుమారు గంట పాటు కురిసిన వర్షానికి పట్టణంలోని లోతట్టు ప్రాంతాలైన బాలాజీనగర్, చీడికాడ రోడ్డు జలమయం అయ్యాయి.

రావికమతంలో...

రావికమతం, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): మండలంలో శుక్రవారం మధ్యాహ్నం కుండపోత వాన పడింది. దీంతో గెడ్డలు పొంగాయి. ఉదయం ఎండ తీవ్రంగా కాసింది. మధ్యాహ్నం వాతావరణం మారిపోయింది. సుమారు రెండు గంటల నుంచి సాయంత్రం వరకు ఏకదాటిగా వర్షం కురిసింది. దీంతో గెడ్డలు, వాగులు వర్షపు నీటితో పొంగి పారాయి. చెరువులు నిండుకుండలా తొణికిసలాడుతున్నాయి. ఈ వర్షం వరి, సరుగుడు, జీడి మామిడి పంటలకు మేలు చేస్తుందని రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఈ ఏడాది వరి పంట పండేందుకు ఢోకా ఉండదని రైతులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. ఇదిలా ఉండగా వర్షాలకు గ్రామీణ రహదారులు బురదమయంగా మారిపోయి వాహన రాకపోకలకు ఇబ్బందిగా తయారయ్యాయి.

కృష్ణాదేవిపేటలో...

కృష్ణాదేవిపేట, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): గొలుగొండ మండలంలోని ఏఎల్ పురం, చోద్యం, పాతకృష్ణాదేవిపేట, లింగంపేట, నాగాపురం, కొంగసింగి తదితర ప్రాంతాల్లో శుక్రవారం మోస్తర వర్షం పడింది. గత కొన్ని రోజులుగా పడుతున్న వర్షాలతో చెరువులు, గెడ్డలు నీటితో కళకళలాడుతున్నాయి. అంతేకాకుండా లోతట్టు ప్రాంతాలు జలమయం అయ్యాయి. ఏఎల్‌పురం-కొంగసింగి, చోద్యం,-పాత కృష్ణాదేవిపేట తదితర రహదారుల గోతుల్లో వర్షం నీరు అధ్వానంగా మారాయి. ఏఎల్ పురం హైస్కూల్‌లో వాన నీరు నిల్వ ఉండిపోయింది. బీసీ కాలనీలో లోతట్టు ప్రాంతాల్లోని ఇళ్లల్లోకి నీరు చేరడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు.

ఆర్య వైశ్య సంఘం జిల్లా అధ్యక్షుడిగా శ్రీనాథ శ్రీనివాసరావు



మాడుగుల, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): ఐవీఫ్ ఇంటర్నేషనల్ ఆర్య వైశ్య ఫెడరేషన్ అనకాపల్లి జిల్లా అధ్యక్షుడిగా వ్యాపారవేత్త, మాజీ ఉప సర్పంచ్ శ్రీనాథ శ్రీనివాసరావును ఎన్నుకున్నారు. ఆయన రైల్వే బోర్డు సభ్యుడిగా, జూనియర్ కళాశాల చైర్మన్‌గా పనిచేయడంతో పాటు పలు ఆలయాల అధ్యక్షుడిగా సేవలు అందిస్తున్నారు. మళ్లీ శ్రీనివాసరావుకు బాధ్యాతాయుతమైన పదవి లభించడంపై ఆర్యవైశ్య సంఘం నాయకులు, కుటుంబీకులు, అభిమానులు ఆయన్ను అభినందించారు.

విద్యుత్ సమస్యలు పరిష్కరించరూ..

మాడుగుల రూరల్, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): అవురువాడ వీర నారాయణం పంచాయతీ పరిధిలో విద్యుత్ సమస్యలు పరిష్కరించాలని గ్రామస్థులు వేడుకొంటున్నారు. సమస్యలను సంబంధిత అధికారులకు తెలియజేసినా పట్టించుకోవడం లేదని ఆరోపిస్తున్నారు. శాశ్వత విద్యుత్ లైన్‌మన్ లేక విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడినప్పుడు సకాలంలో పునరుద్ధరించే పరిస్థితులు ఉండడం లేదని తెలిపారు. ఈ విషయమై ఏఈ రాంబాబును వివరణ కోరగా సమస్యలు త్వరితగతిన పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని చెప్పారు.

డాక్టర్ ఖాశీంకు జాతీయ స్థాయి అవార్డు



విశాఖపట్నం ఎంపీ భరత్ చేతుల మీదుగా అవార్డు అందుకుంటున్న ఖాసీం

కె.కోటపాడు, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): స్థానిక అయ్యన్న ఇంగ్లీషు మీడియం స్కూల్ సెక్రటరీ, కరస్పాండెంట్ డాక్టర్ ఖాశీం విద్యా రంగంలో విశేష కృషి చేస్తున్నందుకు జాతీయ స్థాయి అవార్డు లభించింది. మళ్ల బ్యూరో ఆఫ్ చైల్డ్ డెవలప్‌మెంట్ వారి వండర్ కిడ్స్ స్కూల్, నిసా, అపుస్మా, ట్రస్మా వారు ఆయన్ను 'ఎడ్యూఐకాన్ -2025' అవార్డుకు ఎంపిక చేశారు. గురువారం విశాఖపట్నంలో నిర్వహించిన అవార్డుల ప్రదానోత్సవంలో ఎంపీ భరత్, నేషనల్ ఇండిపెండెంట్ స్కూల్స్ అలయన్స్ (నిసా) అధ్యక్షుడు కె.శర్మ, 'అపుస్మా' చీఫ్ మెంటార్ ఎ.కృష్ణారెడ్డి, రాష్ట్ర అధ్యక్షులు కె.తులసివిష్ణుప్రసాద్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డాక్టర్ ఎస్.శ్రీనివాసరావు, ట్రస్మా అధ్యక్షులు ఎస్.మధుసూదన్, బ్రెయిన్ ఫీడ్ ఎడ్యుకేషనల్ మ్యాగజైన్ సీఈఓవో బ్రహ్మం వి.కాకాని చేతుల మీదుగా డాక్టర్ ఖాశీం అవార్డు అందుకున్నారు. ఈ అవార్డు రావడంపై విద్యా సంస్థల సిబ్బంది, ఉపాధ్యాయులు అభినందించారు.

దేవరాపల్లిలో ఆలయ భూముల పరిశీలన



ఉమామహేశ్వరీదేవి ఆలయ భూములను పరిశీలిస్తున్న దేవదాయ శాఖాధికారిణి లక్ష్మిసుధారాణి

దేవరాపల్లి, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో ఉమామహేశ్వరీదేవి ఆలయ భూములను దేవదాయ శాఖ జిల్లా అధికారిణి కె.లక్ష్మీసుధారాణి శుక్రవారం పరిశీలించారు. ఈ భూములు ఆక్రమణలకు గురయ్యాయని దేవరాపల్లికి చెందిన చొక్కాకుల వెంకటరమణ పీజీఆర్ఎస్‌లో ఫిర్యాదు చేయడంతో ఆ శాఖ ఇన్‌స్పెక్టర్ డి.వసంత్ కుమార్‌తో కలిసి ఆమె పరిశీలించారు. షాపులను పరిశీలించి అద్దె ఎవరికి చెల్లిస్తున్నారని ప్రశ్నించారు. సమగ్రంగా దర్యాప్తు చేసి ప్రభుత్వానికి నివేదిక ఇస్తామని ఆమె తెలిపారు.

29న సాముహిక గృహ ప్రవేశాలు

గృహ నిర్మాణ శాఖ ఏఈ జోగారావు



సమావేశంలో మాట్లాడుతున్న ఏఈ జోగారావు

నాతవరం, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి) : మండలంలో ఈ నెల 29వ తేదీన ఎన్టీఆర్ గృహ ప్రవేశాలు నిర్వహిస్తామని గృహ నిర్మాణ శాఖ ఏఈ జోగారావు తెలిపారు. శుక్రవారం మండల పరిషత్ కార్యాలయంలో పంచాయితీ కార్యదర్శులు. గ్రామ సచివాలయ ఉద్యోగులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. 29న ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు అన్నమయ్య జిల్లాలో సాముహిక గృహప్రవేశాలను ప్రారంబిస్తారని తెలిపారు. నాతవరం మండలంలో 740 ఇళ్లు పూర్తయ్యాయని, లబ్ధిదారులు సాముహిక గృహ ప్రవేశాలు చేస్తారని చెప్పారు. అధికారులు సమన్వయంతో పనిచేసి నూతన గృహలకు లబ్ధిదారులు తోరణాలు, పసుపు తదితర ఏర్పాట్లు చేసేలా చూడాలన్నారు. అలాగే నామినేటెడ్ పదవులు ఉన్న తాండవ చైర్మన్ కరక సత్యనారాయణ, కొంప్రు మరిడియ్య తదితర వ్యక్తులను కూడా గృహ ప్రవేశాలకు ఆహ్వానించాలని ఆయన సూచించారు. అంతేకాకుండా ప్రధానమంత్రి ఆవాస్ యోజన స్కీమ్ గృహల మంజూరు కోసం లబ్ధిదారులు వచ్చే నెల 5వ తేదీలోగా గ్రామ సచివాలయాల్లో పేర్లు నమోదు చేయించుకోవాలని ఆయన సూచించారు. ఈ గృహాల కోసం కేంద్ర ప్రభుత్వం మొత్తం రూ.లక్షా 62 వేల రూపాయలు మంజూరు చేస్తుందన్నారు. ఈ అవకాశాన్ని అర్హులైన ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. కార్యక్రమంలో మండల పరిషత్ పరిపాలనాధికారి పి.పార్థసారధి తదితరులు పాల్గొన్నారు.

జ్వరాల బారిన పడకుండా ఆదివాసీలను రక్షించండి

రావికమతం, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): ఆదివాసీలకు దోమతెరలు పంపిణీ చేసి జ్వరాల బారి నుంచి రక్షించాలని సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యుడు గోవిందరావు డిమాండ్ చేశారు. ఈ మేరకు శుక్రవారం నిరసన తెలిపారు. డోలవానిపాలెం, కొట్నాబిల్లి గ్రామాల్లో దోమల అధికంగా ఉండడంతో ఆదివాసీలు మలేరియా, డెంగ్యూ బారిన పడుతున్నారని చెప్పారు. దీనిపై అధికారులకు వినతిపత్రం అందించినా స్పందించడం లేదని వాపోయారు. ఆయా గ్రామాల ఆదివాసీలకు దోమతెరలు పంపిణీ చేయకపోతే ఆందోళనకు దిగుతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో గిరిజన సంఘం నాయకులు సింగారపు వలసయ్య, పాడి బెన్నయ్య పాల్గొన్నారు.

కల్యాణ మండపం నిర్మాణానికి ఎమ్మెల్యే రాజు హామీ

రజక సంఘం జిల్లా అధ్యక్షుడు కోటేశ్వరరావు

చోడవరం, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): నియోజకవర్గ కేంద్రంలో రజకులకు కల్యాణ మండపం నిర్మాణానికి స్థానిక ఎమ్మెల్యే కేఎస్ఎన్ఎస్ రాజు హామీ ఇచ్చారని రజక సంఘం జిల్లా అధ్యక్షుడు చల్లపల్లి కోటేశ్వరరావు శుక్రవారం తెలిపారు. పట్టణంలోని బానయ్య కోనేరు ప్రాంతంలో జిల్లా రజక సంఘానికి ఉన్న సామాజిక భవనం శిథిలావస్థకు చేరిందని, ఈ భవనం స్థానంలో రజకులకు కల్యాణ మండపం నిర్మాణానికి ఎమ్మెల్యేకు సంఘం తరఫున వినతిపత్రం సమర్పించామని చెప్పారు. దీనిపై స్పందించిన ఎమ్మెల్యే రాజు రజకులకు కల్యాణ మండపం నిర్మాణానికి అవసరమైన నిధులు మంజూరు చేయిస్తామని హామీ ఇచ్చారని ఆయన వివరించారు.

కోటి సంతకాల్లో భాగస్వాములుకండి

మాజీ డిప్యూటీ సీఎం ముత్యాలనాయుడు

చీడికాడ, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణను వ్యతిరేకిస్తూ చేపడుతున్న కోటి సంతకాల సేకరణ కార్యక్రమంలో అందరూ భాగస్వామ్యం కావాలని మాజీ డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు పిలుపునిచ్చారు. ఈ మేరకు అప్పలరాజుపురం గ్రామంలో వైఎస్ఆర్ విగ్రహం వద్ద పోస్టర్‌లను చూపితూ శుక్రవారం నిరసన తెలిపారు. అనంతరం ఆయన మాట్లాడుతూ మెడికల్ కాలేజీలను ప్రైవేటీకరణ చేస్తూ కూటమి ప్రభుత్వం పేద విద్యార్థులకు తీవ్రంగా అన్యాయం చేస్తుందని ఆరోపించారు. దీన్ని వ్యతిరేకిస్తూ మాజీ సీఎం వైఎస్.జగన్ పిలుపుమేరకు కోటి సంతకాల సేకరణలో గ్రామీణ ప్రాంత వాసులు భాగస్వామ్యం కావాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు గొల్లవిల్లి రాజబాబు, యూత్ అధ్యక్షుడు గొల్లవిల్లి స్వామినాయుడు, ఎంపీపీ కురచా జయమ్మ, సీడీసీ చైర్మన్ సుంకరి శ్రీనివాసరావు, పార్టీ నాయకులు చుక్క అప్పలనాయుడు, వేచలపు కామేష్, ఎన్.రమణ బాబు, పరవాడ రామారావు, పరవాడ మహేశ్, తదితరులు పాల్గొన్నారు.

28న వైసీపీ ప్రజా ఉద్యమం

నర్సీపట్నం, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): వైద్య కళాశాలలు పీపీపీ విధానంలో నిర్వహించడానికి కూటమి ప్రభుత్వం తీసుకున్న నిర్ణయానికి వ్యతిరేకంగా 28న ప్రజా ఉద్యమం చేపడుతున్నామని మాజీ ఎమ్మెల్యే పెట్ల ఉమాశంకర గణేశ్ తెలిపారు. ఈ మేరకు శుక్రవారం పెదబొడ్డేపల్లి పార్టీ కార్యాలయంలో ప్రజా ఉద్యమం పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పార్టీ నాయకులు, కార్యకర్తలు, ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో పలువురు వైసీపీ నాయకులు పాల్గొన్నారు.

పశు సంవర్థక పథకాలను వినియోగించుకోవాలి

రోలుగుంట, అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి): పశుగణాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో అందిస్తున్న పథకాలను పాడి రైతులు సద్వినియోగం చేసుకోవాలని రోలుగుంట పశువైద్యాధికారి నూకేశ్వరరావు సూచించారు. శుక్రవారం రోలుగుంట, కొండపాలెం గ్రామాల్లో మెగా పశువైద్య శిబిరాలను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం ద్వారా అమలువుతున్న పలు రకాల పశుసంవర్థక శాఖ పథకాలను సక్రమంగా వినియోగించుకుని రైతులు పాడి పరిశ్రమపై ఆదాయం పెంచుకోవాలని కోరారు. సక్రమ పశువుల పునరుత్పత్తి కోసం పశువుల మేతలో తగిన మార్పులు చేయాలన్నారు. ఆడ పెయ్యలు మాత్రమే ఉత్పత్తి చేసే వీర్య నాళికలను ప్రభుత్వం రాయితీపై పాడిరైతులకు అందిస్తుందని, ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన సూచించారు. అనంతరం పాడి పశువులకు ఉచితంగా గర్భకోశ పరీక్షలు, గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు వేశారు. అలాగే పలువురు రైతులకు మినరల్ మిక్చర్ ప్యాకెట్లు, బలవర్ధక టానిక్‌లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ ఉప సర్పంచ్ బంటు చిరంజీవి, పశువైద్య సిబ్బంది వల్లిక, శివ, జగదీశ్వరి, అశ్విని తదితరులు పాల్గొన్నారు.

రాజ్యాంగంపై వ్యాసరచన పోటీలు

గొలుగొండ, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని ప్రాథమిక పాఠశాలలో శుక్రవారం భారత రాజ్యాంగంపై విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించారు. ఇన్‌చార్జి ఎంఈవో సత్యనారాయణ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ పోటీల్లో విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు బాలకృష్ణ, ఉపాధ్యాయులు, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

బెల్ట్ దుకాణాల నియంత్రణకు చర్యలు

▸▸ ఎక్సైజ్ సీఐ ఉపేంద్ర

మాడుగుల, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): మద్యం బెల్ట్ దుకాణాలు నియంత్రణ చేసేందుకు ప్రత్యేక చర్యలు తీసుకున్నామని ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ సీఐ ఎల్.ఉపేంద్ర తెలిపారు. శుక్రవారం స్థానిక ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ స్టేషన్‌లో విలేకరులతో ఆయన మాట్లాడుతూ మందుబాబులకు నాణ్యమైన మద్యం అందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఎక్సైజ్ సురక్ష యాప్‌ని ప్రవేశపెట్టిందన్నారు. ఈ యాప్ వల్ల కొనుగోలు చేసిన మద్యం బాటిల్ ఎక్కడ తయారీ అయిందనే విషయం తెలుసుకోవచ్చన్నారు. మద్యం కొనుగోలు చేసినవారు ఈ యాప్‌ను ఏ విధంగా ఉపయోగించాలనే అంశంపై అవగాహనక కల్పించడం జరుగుతుందన్నారు. ఇదిలా ఉండగా నూతన మద్యం పాలసీ వచ్చినప్పటి నుంచి ఇప్పటివరకు బెల్టు దుకాణాలపై దాడిచేసి 51 కేసులు నమోదుచేశామని, 526 సీసాలు స్వాధీనం చేసుకొని 51 మందిని అరెస్ట్ చేశామని ఆయన తెలిపారు. అలాగే మద్యం దుకాణదారులు నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు.

సబ్‌జైలును సందర్శించిన డీఎల్ఎస్ఏ కార్యదర్శి



ఎలమంచిలి సబ్ జైలులో పలు శాఖల అధికారులతో సమావేశమైన డీఎల్ఎస్ఏ కార్యదర్శి ఆర్.సన్యాసినాయుడు

ఎలమంచిలి, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): స్థానిక సబ్ జైలును శుక్రవారం సివిల్ జడ్జి, డీఎల్ఎస్ఏ కార్యదర్శి ఆర్.సన్యాసినాయుడు వివిధ శాఖల అధికారులతో కలిసి సందర్శించారు. సబ్ జైలులో రిమాండ్‌లో వున్న నిందితులతో మాట్లాడి వసతులు, వైద్య సేవలు అందుతున్న తీరు గురించి అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో ఆర్డీఓ ఆయీషా, డిప్యూటీ డీఈవో అప్పారావు, జిల్లా వ్యవసాయాధికారి మోహన్‌రావు, తహశీల్దారు వరహాలు, సీఐ ధనుంజయరావు, జైలు సూపరింటెండెంట్ ప్రసాదరావు, ప్యానెల్ న్యాయవాదులు బి.హరిశంకరరావు, పీవీ రమణ తదితరులు పాల్గొన్నారు.

తాండవ నదిలో పెరిగిన వరద



సత్యవరం వద్ద ఉధృతంగా ప్రవహిస్తున్న తాండవ నది

పాయకరావుపేట రూరల్, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): ఎగువ ప్రాంతంతోపాటు మండలంలో కొద్ది రోజుల నుంచి కురుస్తున్న అధిక వర్షాలతో తాండవ నదిలో వరద ప్రవాహం పెరిగింది. నాతవరం మండలంలో తాండవ జలాశయం స్పిల్‌వే గేట్లు ఎత్తకపోయినప్పటికీ నదిలో వరద ఉధృతి అధికంగానే వుంది. సత్యవరం వద్ద కాజ్‌వేను ఆనుకొని నది ప్రవహిస్తున్నది. సత్యవరం, మాసాహెబ్‌పేట గ్రామాలకు చెందిన రైతులు తాండవ నదికి ఆవల ఉన్న పొలాలకు వెళ్లడానికి వీలుకాని పరిస్థితి నెలకొంది.

సింహాచలం ఈవోగా సుజాత బాధ్యతల స్వీకరణ



ఈవోగా బాధ్యతలు స్వీకరిస్తున్న సుజాత

సింహాచలం, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): సింహాచలం దేవస్థానం కార్యనిర్వహణాధికారిగా దేవాదాయశాఖ జిల్లా డిప్యూటీ కమిషనర్ ఎన్.సుజాత శుక్ర వారం పూర్తి అదనపు బాధ్యతలు చేపట్టారు. ఇప్పటివరకు ఈఓగా పని చేసిన వేంద్ర త్రినాధరావు రాజమహేంద్రవరం మల్టీ జోన్-1 ప్రాంతీయ సంయుక్త కమిషనర్‌గా కొనసాగుతారు. దీంతో సుజాత సింహాద్రినాథుడ్ని దర్శించుకుని, అనంతరం పత్రాలపై సంతకాలు చేసి బాధ్యతలు స్వీకరించారు. ఆమెకు ప్రధానార్చకుడు గొడవర్తి శ్రీనివాసాచార్యులు ఆశీర్వచనాలీయగా, ఏఈఓలు రమణమూర్తి, తిరుమలేశ్వరరావు, వీఆర్‌ఓ అప్పలనాయుడు అభినందనలు తెలిపారు.

యలమంచిలి పురపాలక సంఘం

ఆర్.ఓ.సి.నెం.286/2019/ఎ1 తేది.24-10-2025

బహిరంగ వేలం నోటీసు

యలమంచిలి పురపాలక సంఘం సంబంధించిన కొమ్మయి గుండం షాపింగ్ కాంప్లెక్స్ & పి.వి.కాంప్లెక్స్ నందు 18 మొత్తం తేది.31-10-2025 ఉదయం 11.00 గం.లకు మున్సిపల్ కార్యాలయం నందు బహిరంగ వేలం నిర్వహించబడును. హెచ్చు పాటపై 18% G.S.T. చెల్లించవలెను.

వ.నెం.	షాపింగ్ కాంప్లెక్స్	బహిరంగ వేలం నిర్వహించబడును	ధరావత్తు	సాల్వేన్సీ
1	కొమ్మయి గుండం షాపింగ్ కాంప్లెక్స్ గ్రౌండ్ ఫ్లోర్	షాపు నెం.4, బి.సి. (ఎ) ఉమెన్	ఎస్.సి., ఎస్.టి. వారికి రూ.10,000/- మిగిలిన వారికి రూ.20,000/-	50,000/-
2		షాపు నెం.12, ఓ.సి. (ఎ) ఉమెన్		50,000/-
3		షాపు నెం.29, బి.సి. (ఎ) జనరల్		50,000/-
4		షాపు నెం.30, ఓ.సి. ఉమెన్		50,000/-
5		షాపు నెం.33, ఎస్.టి. జనరల్		---
6	కొమ్మయి గుండం కాంప్లెక్స్ ఫస్ట్ ఫ్లోర్	షాపు నెం.14, బి.సి. (సి)		50,000/-
7		షాపు నెం.16, ఎస్.సి. జనరల్		---
8		షాపు నెం.17, ఓ.సి. ఉమెన్		50,000/-
9		షాపు నెం.18, బి.సి. (డి) ఉమెన్		50,000/-
10		షాపు నెం.19, బి.సి. (ఈ) ఉమెన్		50,000/-
11		షాపు నెం.20, బి.సి. (ఎ) జనరల్		50,000/-
12		షాపు నెం.21, ఓ.సి. జనరల్		50,000/-
13		షాపు నెం.22, ఎస్.సి. ఉమెన్		---
14		షాపు నెం.23, ఓ.సి. ఉమెన్		50,000/-
15		షాపు నెం.24, బి.సి. (బి) జనరల్		50,000/-
16		షాపు నెం.25, ఎస్.టి. జనరల్		---
17		షాపు నెం.26, ఓ.సి. జనరల్		50,000/-
18	పి.వి.కాంప్లెక్స్	షాపు నెం.17, ఓ.సి. ఉమెన్		50,000/-

పూర్తి వివరముల కొరకు ఈ కార్యాలయపు పనిదినములలో రెవెన్యూ అధికారి / రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ వారిని సంప్రదించగలరు అని తెలియజేయడమైనది.

కమిషనర్
యలమంచిలి పురపాలక సంఘం

పంచారామాలకు ప్రత్యేక బస్సులు

- పిక్నిక్ ప్రదేశాలకు మూడు ప్రత్యేక ప్యాకేజీలు
- నర్సీపట్నం పీటీడీ డిపో మేనేజర్ ధీరజ్



పంచారామ క్షేత్ర దర్శనం కరపత్రాన్ని అందజేస్తున్న డిపో మేనేజర్ ధీరజ్

నర్సీపట్నం, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): కార్తీక మాసంలో పంచారామ క్షేత్రాల దర్శనం కోసం ప్రత్యేక బస్సులు నడుపుతున్నామని పీటీడీ నర్సీపట్నం డిపో మేనేజర్ ధీరజ్ తెలిపారు. శుక్రవారం ఆయనిక్కడ విలేకరులతో మాట్లాడుతూ అమరావతి, భీమవరం, పాలకొల్లు, ద్రాక్షారామం, సామర్లకోట పంచారామ క్షేత్రాల దర్శనం చేసుకునే భక్తుల కోసం ఈనెల 26 తేదీ, నవంబరు 2, 9, 16 తేదీలలో పీటీడీ బస్సు బయలుదేరి ఒక్క రోజులో పంచారామ క్షేత్రాల దర్శనం చేయించిన అనంతరం అదేరోజు రాత్రికి నర్సీపట్నం తీసుకువస్తామన్నారు. అల్ట్రా డీలక్స్ బస్సుకి పెద్దలకు రూ.1,450 టిక్కెట్ ధర నిర్ణంచామన్నారు. ముందుగా రిజర్వేషన్ చేయించుకోవాలని సూచించారు. అలాగే కార్తీక మాసం పిక్నిక్ ప్రదేశాలకు మూడు ప్యాకేజీలలో ప్రత్యేక బస్సులు నడుతున్నామన్నారు. నర్సీపట్నం నుంచి లంబసింగి, తాజంగి, కొత్తపల్లి జలపాతం, పాడేరు మోదకొండమ్మ తల్లి గుడి, అమ్మవారి పాదాలు వెళ్లే వారికి ఒక్కొక్కరికి రూ.360లు, నర్సీపట్నం నుంచి సింహాచలం, రుషికొండ, విజయనగరం రామనారాయణంకి ఒక్కొక్కరికి రూ.430, నర్సీపట్నం నుంచి అమ్మవారి పాదాలు, మినుములూరు కాఫీ తోట, పాడేరు అమ్మవారి గుడి, అరకు పద్మాపురం గార్డెన్, ట్రైబల్ మ్యూజియం, డముకు వ్యూ పాయింట్, బొర్రా కేవ్స్ చూపించి తీసుకు రావడానికి ఒక్కొక్కరికి రూ.460 టిక్కెట్ ధర అవుతుందని తెలిపారు. మరింత సమాచారం కోసం పీటీడీ బస్ స్టేషన్ విచారణ విభాగం, 9494811855, 9493211969, 7382916428 ఫోన్ నంబర్లని సంప్రదించాలని కోరారు.

నేడు ఎలమంచిలిలో పంచరాత్రుల తీర్థమహోత్సవం

ఎలమంచిలి, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): పంచరాత్రుల తీర్థ మహోత్సవానికి ఎలమంచిలి ముస్తాబైంది. శనివారం రాత్రి పట్టణంలోని తులసీనగర్ ప్రాంతంలో జరగనున్న ఈ ఉత్సవానికి వేలాది మంది భక్తులు రానుండడంతో నిర్వాహకులు భారీఎత్తున ఏర్పాట్లు చేశారు. భూలోకమాంబ అమ్మవారి ఆలయం, సుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఆలయాల్లో శనివారం ఉదయం ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించిన అనంతరం భక్తులకు దర్శనాలు ప్రారంభం అవుతాయి.

ఎలమంచిలి తులసీనగర్‌లోని భూలోకమాంబ అమ్మవారు, పాతవీధిలోని సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయల్లో దీపావళి రోజు నుంచి నాగుల చవితి వరకూ పంచరాత్రుల ఉత్సవాలను ఘనంగా నిర్వహించడం ఆనవాయితీ. ఉత్సవ కమిటీ చైర్మన్ అయిన విశాఖ డెయిరీ చైర్మన్ ఆడారి ఆనందకుమార్ ఆధ్వర్యంలో ఉత్సవ కమిటీల ప్రతినిధుల పర్యవేక్షణలో పెద్ద ఎత్తున ఏర్పాట్లు చేశారు. దిమిలి ప్రధాన ద్వారం, తులసీనగర్ ప్రధాన ద్వారంతోపాటు ఆలయ పరిసరాల్లోని వీధుల్లో విద్యుద్దీపాల సెట్టింగులు పెట్టారు. భూలోకమాంబ ఆలయం చుట్టూ పసిడి వర్ణంలో ఏర్పాటు చేసిన సెట్టింగులు భక్తులను విశేషంగా ఆకట్టుకుంటున్నాయి. గురవప్ప కల్యాణ మండపంలో చిన్నారుల ఆటవిడుపు కోసం జెయింట్‌వీల్, ఎగ్జిబిషన్ ఏర్పాటు చేశారు. శనివారం రాత్రి సాంస్కృతిక ప్రదర్శనల కోసం పలుచోట్ల స్టేజీలు నిర్మించారు. ఉత్సవానికి వేలాది మంది భక్తులు రానుండడంతో సీఐ ధనుంజయరావు, ఎస్ఐలు సావిత్రి, ఉపేంద్ర పర్యవేక్షణలో పోలీసులు పటిష్ఠ బందోబస్తు ఏర్పాటు చేశారు. ఎలమంచిలిలో పంచరాత్రుల తీర్థ మహోత్సవాన్ని పురస్కరించుకుని పోలీసులు ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరిస్తున్నారు. అడ్డరోడ్డు, రేగుపాలెం వైపు నుంచి ఎలమంచిలి వచ్చే వాహనాలను విజయలక్ష్మి పెట్రోలు బంకు సమీపంలో ఉన్న స్థలంలో, అనకాపల్లి వైపు నుంచి వచ్చే వాహనాలు రూరల్ పోలీస్ స్టేషన్ పరిసరాల్లో, అచ్యుతాపురం, రాంబిల్లి వైపు నుంచి వచ్చే వాహనాలు కల్కి పెట్రోలు బంకు పరిసరాల్లో పార్కింగ్‌కు ఏర్పాట్లు చేశారు.

రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలు ప్రారంభం



క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న సాయికృష్ణ, విజయ్, నర్సింగరావు

మునగపాక, అక్టోబర్ 24 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వాడ్రాపల్లి పెదరామాలయం మైదానంలో గురువారం రాత్రి రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలు ప్రారంభం అయ్యాయి. ఈ పోటీలను మాజీ ఎంపీపీ ఆడారి మంజు, టీడీపీ మండల అధ్యక్షుడు పెంటకోట విజయ్, టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి కర్రి సాయికృష్ణ ప్రారంభించారు. అనంతరం క్రీడాకారులను పరిచయం చేసుకున్నారు. పోటీల నిర్వాహకుడు మళ్ల వరహా నర్సింగరావు మాట్లాడుతూ, వర్షం కురుస్తుండడంతో పోటీలు ఒకింత ఆలస్యంగా ప్రారంభం అయ్యాయని, అయినప్పటికీ క్రీడాభిమానులు ఓపికతో వేచి వున్నారని అన్నారు. లీగ్ విధానంలో నిర్వహిస్తున్న ఈ పోటీల్లో తొలిరోజు నాగులాపల్లి, రాజాం టీమ్‌లు ప్రత్యర్థులపై గెలిచి ఫైనల్‌కు చేరాయి.

రయ్.. రయ్..!

... 5వ పేజీ తరువాయి

అత్యధికులు ప్రైవేటు ట్రావెల్స్ బస్సులను ఆశ్రయిస్తున్నారు. ఇక్కడ సాయంత్రం బయలుదేరితే మరుసటిరోజు ఉదయం అక్కడకు వెళ్లిపోతున్నారు. అందుకని వాటిపై మొగ్గు చూపుతున్నారు. ఈ డిమాండ్‌ను దృష్టిలో ఉంచుకొని నేషనల్ పర్మిట్ కలిగిన బస్సులను రోజుకు 50 నుంచి 60 వరకూ విశాఖపట్నం మీదుగా నడుపుతున్నారు. అదే పండుగలు, టూరిస్ట్ సీజన్లు అయితే 75 వరకు ఉంటున్నాయి. అయితే ఇవన్నీ ఇతర రాష్ట్రాలలో రిజిస్టర్ అయినవి. ఏపీలో ఇలాంటి బస్సులను రిజిస్టర్ చేసుకోవాలంటే ట్యాక్స్ ఎక్కువ చెల్లించాలి. అదే ఇతర రాష్ట్రాల్లో తక్కువ కడితే సరిపోతుంది. దాంతో ఒడిశా వంటి రాష్ట్రాల్లో రిజిస్టర్ చేసుకుంటున్నారు. విజయవాడ, తిరుపతి వంటి ప్రాంతాలకు వెళ్లేవి మాత్రం ఇక్కడే రిజిస్టర్ అవుతున్నాయి. దూరప్రాంతాలకు నడిపే బస్సులను మంచి కండిషన్‌లోనే ఉంచుతారు. అయితే నగరాల్లో ట్రాఫిక్ వల్ల ఈ బస్సులు అనుకున్న సమయానికి చేరవు. అందుకని హైవే ఎక్కగానే డ్రైవర్లు పరిమితికి మించిన వేగంతో దూసుకుపోతుంటారు. ప్రయాణికులు అంతా నిద్రలో ఉండడం వల్ల ఈ విషయం గమనించరు. ఈ క్రమంలో డ్రైవర్ ఏమాత్రం నిర్లక్ష్యం వహించినా భారీ మూల్యం చెల్లించుకోవలసి వస్తుంది. ఈ బస్సుల్లో ఇద్దరు డ్రైవర్లు ఉంటారు. అయినా ఒక్కోసారి నిర్లక్ష్యం వల్ల ప్రమాదాలు తప్పడం లేదు.

అధికారులు అప్రమత్తం

కర్నూలు జిల్లాలో శుక్రవారం ఉదయం బస్సు ప్రమాదానికి ముందు ఈ నెల 15వ తేదీన రాజస్థాన్‌లోని జైసల్మీర్‌లో ఏసీ స్లీపర్ క్లాస్ బస్సు మంటలు అంటుకొని కాలిపోయింది. ఆ ఘటనలో పలువురు మరణించారు. అప్పుడే రవాణా శాఖ అధికారులకు పైనుంచి ఆదేశాలు వచ్చాయి. నేషనల్ పర్మిట్ తీసుకొని టూరిస్ట్ బస్సులుగా నడుస్తున్న వాటిపై దృష్టిపెట్టారు. బెంగళూరు నుంచి వచ్చే బస్సులు అనకాపల్లి, ఆనందపురం నుంచి శ్రీకాకుళం, ఒడిశా వెళుతున్నాయి. రాయగడ, జైపూర్, బరంపురాల నుంచి వచ్చే బస్సులు విశాఖ నగరం మీదుగా హైదరాబాద్ తదితర ప్రాంతాలకు వెళుతున్నాయి. అందుకని అధికారులు ఎన్ఏడీ, కూర్మన్నపాలెం జంక్షన్లలో ఎక్కువగా తనిఖీలు చేపట్టారు. అలాగే అనకాపల్లి వద్ద కూడా తనిఖీలు నిర్వహించారు. అత్యధిక శాతం బస్సుల్లో ఫైర్ ఎస్టింగీషర్లు కండిషన్‌లో లేవని గుర్తించి కేసులు నమోదు చేశారు. తమిళనాడులో రిజిస్టర్ అయిన బస్సు పర్మిట్ గడువు ముగిసినా తిప్పుతున్నట్టు గుర్తించి శుక్రవారం రాత్రి రూ.2,03,00 జరిమానా వేశారు. బీమా పత్రాలు చూపించకపోవడంతో మరో రెండు బస్సులపై కేసులు పెట్టారు. ఎమర్జన్సీ ఎగ్జిట్ సరిగ్గా లేదని రూ.21,200 జరిమానా వేశారు.

పర్మిట్ లేకుండా వస్తే కేసులు తప్పవు

ఆర్.శ్రీనివాసరావు, డిప్యూటీ ట్రాన్స్‌పోర్ట్ కమిషనర్

సరైన పర్మిట్లు, అనుమతులు లేకుండా ట్రావెల్స్ బస్సులను రోడ్లపైకి తీసుకువస్తే దానికి యజమానులే బాధ్యులు. ఈ నెల 13వ తేదీ నుంచి తనిఖీలు నిర్వహించి ఇప్పటివరకూ 58 కేసులు నమోదు చేశాం. నాలుగు సీజ్ చేశాం. మొత్తం రూ.9,58,480 జరిమానా వసూలు చేశాం.

నరక ప్రయాణం

... 5వ పేజీ తరువాయి

రోలుగుంట మండలం వెలంకాయలపాలెం వరకు, వడ్డాది-పాడేరు ఆర్‌అండ్‌బీ రోడ్డులో వడ్డాది నుంచి మాడుగుల మండలం తాటిపర్తి వరకు, అనకాపల్లి నుంచి చోడవరం మండలం వెంకన్నపాలెం వరకు, ఎస్.రాయవరం మండలం అడ్డరోడ్డు నుంచి కోటవురట్ల మీదుగా నర్సీపట్నం వెళ్లే రోడ్డులో ఇందేశమ్మవాక ప్రాంతం, రావికమతం నుంచి తట్టబంద వెళ్లే రోడ్డు, పరవాడ నుంచి అచ్యుతాపురం మీదుగా ఎలమంచిలి వెళ్లే రోడ్డు, జాతీయ రహదారి నుంచి నర్సీపట్నం వెళ్లే రోడ్డులో తాళ్లపాలెం వద్ద.. ఇలా చెప్పుకుంటూపోతే అధ్వాన రోడ్లకు అంతే వుండదు. కూటమి అధికారంలోకి వచ్చిన తరువాత గత ఏడాది 'పల్లె పండుగ' పేరుతో పంచాయతీరాజ్ శాఖ పరిధిలోని రహదారులపై ఏర్పడిన గోతులను తాత్కాలికంగా కప్పారు. ఈ ఏడాది వేసవి వరకు పరిస్థితి బాగానే వుంది. వర్షాకాలం మొదలైన తరువాత రోడ్లపై ఎక్కువసేపు నీరు నిలిచిపోవడం, భారీ వాహనాల రాకపోకలతో ప్యాచ్ వర్క్‌లు లేచిపోయి పరిస్థితి మళ్లీ మొదటికొచ్చింది. వర్షాకాలం ముగుస్తున్నందున రహదారుల అభివృద్ధి పనులకు ప్రభుత్వం నిధులు మంజూరు చేయాలని ప్రజలు, వాహనదారులు విజ్ఞప్తి చేస్తున్నారు.



తాళ్లపాలెం నుంచి నర్సీపట్నం వెళ్లే రోడ్డు పరిస్థితి

రూ.350 కోట్లతో 'రైవాడ' ఆధునికీకరణ

... 5వ పేజీ తరువాయి

సందర్శించారు. కుడి, ఎడమ కాలువల ఇన్‌టెక్ ఛాంబర్‌ల పనితీరును పరిశీలించారు. స్పిల్‌వే వద్దకు వెళ్లి గేట్ల పనితీరు, ఇన్‌ఫ్లో/ అవుట్‌ఫ్లో వివరాలను డీఈఈ జి.సత్యనాయుడును అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన రైవాడ అతిథిగృహానికి చేరుకుని మీడియాతో మాట్లాడారు. డ్యామ్ రిహెబిలిటేషన్ అండ్ ఇంప్రూవ్‌మెంట్ ప్రోగ్రాం (డ్రిప్) ద్వారా రూ.350 కోట్లతో రిజర్వాయర్ విస్తరణ కోసం కేంద్ర ప్రభుత్వానికి రాష్ట్ర ప్రభుత్వం ప్రతిపాదనలు పంపినట్టు ఆయన చెప్పారు. ఆమోదం లభించిన వెంటనే పనులు ప్రారంభమవుతుందన్నారు. పంట కాలువల ఆధునికీకరణకు 'జైకా' నిధులు రూ.50 కోట్ల మంజూరు కోసం ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపించామన్నారు. జిల్లాలో గ్రోయిన్లకు మరమ్మతులతోపాటు వంద ఎకరాలకు పైబడి ఆయకట్టు, ఐదు ఎకరాలకుపైబడి విస్తీర్ణం కలిగిన చెరువుల అభివృద్ధి కోసం 'ట్రిపుల్ ఆర్' పథకం ద్వారా రూ.133 కోట్ల వ్యయంతో 88 పనులు చేపట్టడానికి ప్రభుత్వ అనుమతి కోరామన్నారు. జల వనరుల శాఖలో సిబ్బంది కొరత వుందని, సుమారు వంద మంది సిబ్బంది అవసరమని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లినట్టు చెప్పారు. ఆయన వెంట డీఈఈ జి.సత్యనాయుడు, జలాశయం చైర్మన్ పోతల పాత్రునాయుడు, ఇతర అధికారులు వున్నారు.

కశింకోట పూర్వ కార్యదర్శి ఆర్థిక అవకతవకలు

... 5వ పేజీ తరువాయి

ఆన్‌లైన్‌లో అప్‌డేట్ చేశారని తెలిపారు. మిగిలిన రూ.20,60,215 ఇంతవరకు జమ చేయలేదని పేర్కొన్నారు. అదే విధంగా 2024-25 ఇళ్ల పన్నులకు సంబంధించి రికార్డులను సరిగా నిర్వహించలేదని, 15వ ఆర్థిక సంఘం నిధులకు సంబంధించి క్యాష్ బుక్ నిర్వహణ కూడా సరిగా లేదన్నారు. ఇంకా వివిధ పనుల పేరుతో డ్రా చేసిన డబ్బులకు సంబంధించి ఎటువంటి సంతకాలు లేవని పేర్కొన్నారు. పరికరాలు, ఇతర సామాగ్రి కొనుగోలుచేసి, స్టాక్ రిజిస్టర్‌లు నిర్వహించలేదని, వీటిపై పలుమార్లు సమాచారం అడిగినా స్పందించలేదని, దీంతో ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశానని డిప్యూటీ ఎంపీడీవో తోటారావు పేర్కొన్నారు.

క్రైం... crime news

బండరాయిపై పడి గిరిజనుడి మృతి



మృతి చెందిన శ్రీనివాసరావు

కొయ్యూరు, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): నాచుతో కూడిన బండరాయిపై నుంచి వస్తూ కాలుజారి పడిపోవడంతో గిరిజనుడు శుక్రవారం ఉదయం మృతి చెందాడు. మంప ఎస్ఐ శంకరరావు అందించిన వివరాలిలా ఉన్నాయి.

మండలంలో మంప పంచాయతీ ఆర్.దొడ్డవరం గ్రామానికి చెందిన మొట్టడం శ్రీనివాసరావు(50) తన పొలాన్ని కోతులు, అడవి పందుల బారి నుంచి రక్షించుకునే చర్యలో భాగంగా గురువారం రాత్రి కాపలాకు వెళ్లి శుక్రవారం ఉదయం ఇంటికి వస్తుండగా.. మార్గ మధ్యలో ఉన్న చాపరాయి మీదుగా వస్తుండగా కాలు జారి పడిపోయాడు. ఈ ఘటనలో అతని తల వెనుక భాగంలో, వెన్నెముక భాగాలకు తీవ్ర గాయాలయ్యాయి. దీంతో అతని పరిస్థితి విషమించింది. ఇది గుర్తించిన గ్రామస్థులు, కుటుంబీకులు శ్రీనివాసరావును వెంటనే వై.రామవరం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా వైద్యులు పరీక్షించి అప్పటికే మరణించినట్టు ధ్రువీకరించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఆయన తెలిపారు. శ్రీనివాసరావు మృతిపై కుటుంబస సభ్యులు ఎటువంటి అనుమానాలు వ్యక్తం చేయలేదని ఎస్ఐ శంకరరావు చెప్పారు.

బైక్‌లు ఢీకొని ఒకరి మృతి



మృతి చెందిన చిన్నబ్బాయి

నాతవరం, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): మండలంలోని తుని-నర్సీపట్నం మార్గంలో ఎం.బెన్నవరం సమీపంలో రెండు బైక్‌లు ఢీకొన్న సంఘటనలో ఒక వ్యక్తి మృతి చెందగా.. మరొకరికి గాయాలయ్యాయి. ఎస్ఐ తారకేశ్వరరావు అందించిన వివరాలిలా ఉన్నాయి. గొలుగొండ మండలం కొత్తఎల్లవరం గ్రామానికి చెందిన తమరాన చిన్నబ్బాయి(60) శుక్రవారం మధ్యాహ్నం కాకినాడ జిల్లా వెలమపేటలో కుమార్తె ఇంటికి బైక్‌పై వెళుతుండగా ఎం.బెన్నవరం దగ్గర తాండవ జంక్షన్ నుంచి ఎదురుగా వస్తున్న మరో బైక్ ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో తమరాన చిన్నబ్బాయికి తీవ్ర గాయాలు కావడంతో నర్సీపట్నం ఆసుపత్రికి తీసుకెళుతుండగా మార్గమధ్యలో మృతి చెందాడు. అందిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ తారకేశ్వరరావు తెలిపారు. శవ పంచనామా నిమిత్తం మృతదేహాన్ని నర్సీపట్నం ఏరియా ఆసుపత్రికి తరలించినట్టు ఆయన చెప్పారు.

పురుగుల మందు తాగి యువకుడి ఆత్మహత్య



గేటి ప్రసాద్ (ఫైల్ ఫొటో)

కోటవురట్ల, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): మండలంలోని బీకేపల్లిలో ఒక యువకుడు పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఇందుకు సంబంధించి ఎస్ఐ రమేశ్ అందజేసిన వివరాలిలా ఉన్నాయి. బాపిరాజు కొత్తపల్లి గ్రామానికి చెందిన గేటి ప్రసాద్ (23) కూలి పనులకు వెళుతూ జీవనం సాగిస్తున్నాడు. తల్లిదండ్రులు కొంతకాలం క్రితం చనిపోగా, సోదరికి వివాహమై వేరే ఊరులో భర్తతో వుంటున్నది. ఒంటరిగా వుంటున్న ప్రసాద్ తనను బంధువులు ఎవరూ పట్టించుకోవడం లేదని మనోవేదన చెందుతున్నాడు. ఈ నెల 20వ తేదీన పురుగుల మందు తాగి ఆత్మహత్యకు యత్నించాడు. అపస్మారక స్థితికి చేరుకున్న ఇతనిని పెదనాన్న కుమారుడు గుర్తించి, ప్రసాద్ సోదరికి సమాచారం ఇచ్చారు. అనంతరం నర్సీపట్నం ఏరియా ఆస్పత్రికి తరలించారు. ప్రథమ చికిత్స అనంతరం విశాఖపట్నం కేజీహెచ్‌కి పంపారు. అక్కడ చికిత్స పొందుతూ శుక్రవారం తెల్లవారుజామున మృతిచెందాడు. ఇతని సోదరి నాగమణి ఇచ్చిన ఫిర్యాదుమేరకు కేసు నమోదు చేసినట్టు ఎస్ఐ తెలిపారు.

ఆర్టీసీ బస్సు ఢీకొని భార్యాభర్తలకు తీవ్రగాయాలు

అనకాపల్లి టౌన్, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): స్థానిక విజయరామరాజుపేట అండర్‌బ్రిడ్జి వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో భార్యాభర్తలకు తీవ్రగాయాలయ్యాయి. విజయరామరాజుపేటకు చెందిన నందూరి వెంకటాచార్యులు, భార్య వెంకటరమణి ద్విచక్ర వాహనంపై నూకాంబిక ఆలయానికి బయలుదేరారు. రైల్వే అండర్‌బ్రిడ్జి వద్ద స్పీడ్‌బ్రేకర్లు వుండడంతో వాహన వేగాన్ని తగ్గించారు. ఇదే సమంలో వెనుక నుంచి వస్తున్న ఆర్టీసీ బస్సు ఢీకొన్నది. దీంతో భార్యాభర్తలిద్దరూ కిందపడిపోయారు. తీవ్రగాయాలు కావడంతో చికిత్స నిమిత్తం ఎన్టీఆర్ వైద్యాలయానికి తరలించారు. ప్రథమ చికిత్స అనంతరం విశాఖలోని ఒక ప్రైవేటు ఆస్పత్రికి పంపారు. క్షతగాత్రుల కుమారుడు కిశోర్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ట్రాఫిక్ ఎస్ఐ శేఖరం తెలిపారు.

బల్క్‌డ్రగ్ పార్కు వద్దంటే వద్దు..

... 5వ పేజీ తరువాయి

కలెక్టర్ చెప్పారు. దీంతో శుక్రవారం కలెక్టర్ విజయకృష్ణన్ ఇక్కడకు వచ్చారు. సుమారు మూడు గంటలపాటు మత్స్యకారులతో సమావేశం నిర్వహించి వారి అభిప్రాయాలను తెలుసుకున్నారు. సమీపంలోని హెటిరో ఔషధ కంపెనీ నుంచి వెలువడే కాలుష్యం కారణంగా అనేక మంది క్యాన్సర్‌తోపాటు మూత్రపిండాలు, కాలేయ సంబంధిత వ్యాధులతో బాధపడుతున్నారని, ఇంతవరకు 58 మంది ప్రాణాలు కోల్పోయారని మత్స్యకారులు చెప్పారు. గర్భస్రావాలు అధికం అయ్యాయని, సంతానం కలగడం లేదని, సముద్రంలో మత్స్య సంపదకు ముప్పు వాటిల్లడం వల్ల ఉపాధి కోసం వలస పోతున్నామని మత్స్యకార నాయకులు దైలపల్లి కృష్ణ, మైలపల్లి మహేశ్, బైరాగిరాజు, గోసల రాజశేఖర్, చొక్కా కాశీ, చేపల సోమేశ్, గోసల స్వామి, బొంది బాబ్జీ, పిక్కి తాతీలు, పిక్కి స్వామి తదితరులు ఆవేదన వెలిబుచ్చారు. ఇటువంటి పరిస్థితుల్లో బల్క్‌డ్రగ్ పార్కు ఏర్పాటైతే తమకు మరణశాసనం రాసినట్టేనని చోడిపిల్లి కాశీ, బొంది రాజులమ్మ, పిక్కి పైడితల్లి, పిక్కి కోటి వాపోయారు. బల్క్‌డ్రగ్ ఏర్పాటు పనులను వెంటనే ఆపించాలని కోరుతూ కలెక్టర్‌కు వినతిపత్రం అందించారు. ఈ కార్యక్రమంలో నర్సీపట్నం ఆర్డీవో వీవీ రమణ, డ్వామా పీడీ పూర్ణిమా దేవి, స్థానిక తహసీల్దారు నర్సింహమూర్తి, ఇతర అధికారులు పాల్గొన్నారు.

కాగా కలెక్టర్ పర్యటన సందర్భంగా శాంతిభద్రతల సమస్య తలెత్తకుండా పోలీసులు భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. సభా వేదిక వద్దకు మత్స్యకారులు ర్యాలీగా వచ్చారు. పోలీసులు ప్రతి ఒక్కరినీ తనిఖీ చేసిన తరువాతే సభా ప్రాంగణంలోకి అనుమతించారు. నక్కపల్లితోపాటు పాయకరావుపేట నియోజకవర్గంలోని ఇతర మండలాలకు చెందిన సీపీఎం, సీఐటీయూ, వామపక్షాల నేతలను పోలీసులు గృహనిర్బంధం చేశారు.

దంచికొట్టిన వాన

... 5వ పేజీ తరువాయి

కోటవురట్లలో 48.8, రోలుగుంటలో 48.2, చోడవరంలో 45.2, మాకవరపాలెంలో 42.6, కశింకోటలో 40.8, ఎలమంచిలిలో 37.6, దేవరాపల్లిలో 34.6, గొలుగొండలో 34, మునగపాకలో 31.4, పాయకరావుపేటలో 27.8, నర్సీపట్నంలో 27.4, అనకాపల్లిలో 24.6, పరవాడలో 23.2, బుచ్చెయ్యపేటలో 23.2, నక్కపల్లిలో 20.2, అచ్యుతాపురంలో 19.2, రావికమతంలో 17.2, మాడుగులలో 15, సబ్బవరంలో 13.6, రాంబిల్లిలో 12.4, చీడికాడలో 9.2, ఎస్.రాయవరం మండలంలో 6.4 మిల్లీమీటర్ల వర్షం కురిసింది. శుక్రవారం పగలు అక్కడక్కడా ఒక మోస్తరు వర్షం కురవగా, సాయంత్రం రావికమతం మండలంలో కుండపోతగా వర్షం కురిసింది.

చికెన్ ధరలు

బ్యాగ్	రూ.లలో
రైతు ధర	120.00
లైవ్ ధర	140.00
విత్ స్కిన్	250.00
స్కిన్ లెస్	260.00

కోడి గుడ్లు (నెక్)

వంద గుడ్లు	రూ.లలో
విశాఖపట్నం	550
విజయనగరం	554
శ్రీకాకుళం	554